
చోడవరంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయం

జిల్లాలోని 21 ఆలయాల
పునర్ వర్గీకరణ

» ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

అనకాపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలోని దేవాలయాలను పునర్ వర్గీకరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న 21 దేవాలయాలను వర్గీకరణ చేశారు. జీవో ప్రకారం జిల్లాలో చోడవరం శ్రీవిఘ్నేశ్వర స్వామి ఆలయం, నర్సీపట్నంలోని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి ఆలయాలు గతంలో 6(ఎ)(2) ఉండగా, వర్గీకరణ నేపథ్యంలో 6(బి)(2)గా మార్పు చేశారు. ఆలయాల పరిధిలోని సత్రాలను ఎలమంచిలి, చోడవరం సత్రాలను 6(బి) నుంచి 6(సి)గా వర్గీకరించారు. దీంతో పాటు అనకాపల్లిలో భోగలింగేశ్వర స్వామి ఆలయం, శ్రీజనార్దన స్వామి ఆలయం, శ్రీసంతోషిమాత అమ్మవారి ఆలయం, శ్రీసత్యనారాయణస్వామి ఆలయం, సబ్బవరం మండలం సోమనాథపురంలోని శ్రీసోమలింగేశ్వర ఆలయం, చోడవరం గౌరీశ్వరస్వామి వారి ఆలయం, బుచ్చెయ్యపేట శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, నర్సీపట్నం మండలం బలిఘట్టంలోని నూకాలమ్మ అమ్మవారి ఆలయం, బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం, అచ్యుతాపురం మండలం దోసూరులో శ్రీబ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం, రావిపాలెంలోని కోదండరామస్వామి ఆలయం, నక్కపల్లి మండలం ఒడ్డిమెట్టలోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయం, రాంబిల్లి మండలం పంచదార్లలోని శ్రీధారమల్లేశ్వరస్వామి ఆలయం, గొలుగొండ మండలం దారమఠంలో శ్రీదామలింగేశ్వర ఆలయం, ఎస్.రాయవరం మండలం కొరుప్రోలులో శ్రీ సీతారామస్వామి ఆలయం, తిమ్మాపురంలోని పేరిచర్ల పెద్దిరాజు అన్నదాన సత్రాన్ని వర్గీకరణలో భాగంగా ప్రస్తుతం ఉన్న 6(బి) కేటగిరీ నుంచి 6(సి)2 కేటగిరీ ఆలయాలుగా వర్గీకరణ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఆగని ఆక్రమణలు

ప్రభుత్వం మారినా పేదల కాలనీల్లో కొనసాగుతున్న వైసీపీ నేతల దందా

» కూటమి నేతలతో జత కట్టి చెలరేగిపోతున్న వైనం
» ప్రభుత్వ స్థలాల్లో దర్జాగా అక్రమ నిర్మాణాలు
» పట్టించుకోని అధికారులు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు కొనసాగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో చెలరేగిపోయిన ఆ పార్టీ నాయకులు ఇప్పుడు కూటమి అధికారంలో ఉన్నా దందా కొనసాగిస్తున్నారు. కూటమి నేతలతో జత కట్టి ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.


అనకాపల్లి మండలం సుందరయ్యపేటలో పేదల కాలనీలోని ఖాళీ జాగాలో ఇళ్ల నిర్మాణాలు

అనకాపల్లి మండలం సీతానగరం రెవెన్యూ సుందరయ్యపేట జగనన్న లేఅవుట్‌లో యథేచ్ఛగా భూ ఆక్రమణలు, అక్రమ కట్టడాలు కొనసాగుతున్నాయి. సర్వే నంబర్లు 511, 428, 523/1లోని సుమారు 12 ఎకరాల్లో 2020లో 76 మంది పేదలకు అప్పటి వైసీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించింది. ఇదే లేఅవుట్‌లో ఇంకా సుమారు ఆరు ఎకరాల స్థలం ఖాళీగా ఉంది. ఈ స్థలంపై అప్పటి వైసీపీ స్థానిక నేతల కన్ను పడింది. అప్పట్లో సుందరయ్యపేట లేఅవుట్‌కు సమీపంలో ఖాళీ జాగాలో దర్జాగా ప్లాట్‌లు వేసి సెంటు రూ.1.5 లక్షలు ధర నిర్ణయించి మరీ ప్రైవేటు వ్యక్తులకు రెండు నుంచి 5 సెంట్లు చొప్పున అమ్ముకొని వైసీపీ నేతలు జేబులు నింపుకున్నారు. అప్పట్లో దీనిపై స్థానిక టీడీపీ నేతలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారం దన్నుతో కనీసం విచారణ కూడా జరగకుండా చేసుకోగలిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సుందరయ్యపేటలో గతంలో వైసీపీ నేతలు ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకొని పేదలకు పంచుతారని అందరూ భావించారు. కానీ పరిస్థితి వేరుగా ఉంది. స్థానిక వైసీపీ నేత ఒకరు కూటమి నేతలతో కలిసిపోయి లేఅవుట్‌లో అక్రమ కట్టడాలకు ప్రోత్సహిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో సుందరయ్యపేట లేఅవుట్‌లో పేదల ఇళ్లను ఆనుకొని ఉన్న ఖాళీ జాగాల్లో అప్పట్లో కొనుగోలు చేసిన ప్రైవేటు వ్యక్తులే మళ్లీ ఇప్పుడు కూటమి నేతల అండదండలతో దర్జాగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. గత రెండు మూడు రోజులుగా సుందరయ్యపేట లేఅవుట్ పరిసరాల్లోని 511, 428, 523/1 సర్వే నంబర్లలో చకచకా నిర్మాణాలు జరిగిపోతున్నాయి. ప్రభుత్వ భూమిలో ఎటువంటి అనుమతులు పొందకుండా సుమారు 13 ఇళ్ల నిర్మాణాలకు ప్రైవేటు వ్యక్తులు ఇప్పటికే పునాదులు తవ్వించారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు మెటీరియల్ సిద్ధం చేశారు. గ్రామంలో ప్రభుత్వ స్థలంలో అడ్డగోలుగా నిర్మాణాలు జరుగుతున్నా కనీసం ప్రశ్నించేవారే కరవయ్యారు. స్థానిక వైసీపీ నేత ఒకరు కూటమి నేతలతో లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకొని మొత్తం వ్యవహారం నడిపిస్తున్నట్టు సమాచారం. గతంలో వైసీపీ నాయకుడు ప్రైవేటు వ్యక్తులకు అమ్మిన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని కూటమి ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తుందని భావిస్తే దానికి భిన్నంగా ఆక్రమణదారులు దర్జాగా పునాదులు తవ్వుకొని ఇంటి నిర్మాణ పనులు చేపడుతుండడంతో లేఅవుట్‌లో ఇళ్లు మంజూరైన పేదలు ఆందోళన చెందుతున్నారు. లేఅవుట్‌లో ఖాళీ జాగాను సామాజిక అవసరాలకు వినియోగించాలే తప్ప ఇలా అడ్డగోలుగా అమ్ముకోవడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు.


ఇంటి నిర్మాణం కోసం నిర్మాణ సామగ్రి సిద్ధం చేసిన ఆక్రమణదారులు

గ్రామకంఠం భూమినీ వదల్లేదు

సుందరయ్యపేట గ్రామానికి ఆనుకొని మొండిపాలెం వెళ్లే రోడ్డులో సర్వే నంబరు 504లోని గ్రామ కంఠం భూమిని కొందరు ఆక్రమించేశారు. సుమారు ఎకరా 40 సెంట్ల గ్రామకంఠం భూమిని మరో కూటమి నేత ఆక్రమించారు. అయితే ఇక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదు. దీనిపై మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి.

భూ ఆధార్‌కు సర్వర్ కష్టాలు

ఈ నెల 27 వరకే గడువు

» రైతు సేవా కేంద్రాలకు క్యూ కడుతున్న రైతులు
» సర్వర్ పని చేయక ఇబ్బందులు
» ఓటీపీలు రాకపోవడంతో రైతులను వెనక్కి పంపుతున్న సిబ్బంది


సర్వర్ ఆగిపోవడంతో భూ ఆధార్ ప్రక్రియ నిలిచిపోయిన దృశ్యం

నర్సీపట్నం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):
సర్వర్‌లో సాంకేతిక సమస్య వల్ల భూ ఆధార్ (ఫార్మర్ రిజిస్ట్రీ) ప్రక్రియ జాప్యమవుతోంది. ఈ నెల 10వ తేదీన ఈ ప్రక్రియ ప్రారంభంకాగా ఇప్పటికి 50 శాతం నమోదు కూడా పూర్తికాలేదు. ఈ నెల 27వ తేదీతో గడువు ముగియనుండడం, సర్వర్ సక్రమంగా పని చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వ్యవసాయ భూమి ఉన్న ప్రతీ రైతు ఆధార్ కార్డు, ఆధార్‌కి అనుసంధానం చేసిన ఫోన్ నంబరు, పట్టాదార్ పాసు పుస్తకం వివరాలతో రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి భూ ఆధార్(ఫార్మర్ రిజిస్ట్రీ)లో పేర్లు నమోదు చేసుకోవాలి. ప్రజలందరి ఆధార్, విద్యార్థులకు ఆపార్ గుర్తింపు కార్డులు ఇస్తున్నట్టే రైతులందరికీ 11 అంకెలతో గుర్తింపు కార్డు ఇస్తారు. ఫిబ్రవరి 10వ తేదీ నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభించారు. ఈ నెల 27తో గడువు ముగుస్తుంది. డివిజన్‌లో 73,449 మంది రైతులు ఉండగా, ఇప్పటి వరకు 26,630 మంది రైతులు నమోదు చేసుకున్నారు. పీఎం కిసాన్, వ్యవసాయ పెట్టుబడి సాయం, యంత్ర సామగ్రి పంపిణీ, పంటల బీమా పథకాలు మంజూరు కావాలంటే తప్పనిసరిగా భూ ఆధార్‌లో రైతులు వివరాలు నమోదు చేసుకోవాలి. బ్యాంక్ ఖాతాతో అనుసంధానం చేసి నంబరు ఉన్న సెల్‌ఫోన్‌ను రైతులు వెంట తీసుకు వెళితే మూడు ఓటీపీలు వస్తాయి. మూడు ఓటీపీలు భూ ఆధార్‌లో నమోదు చేస్తేనే ప్రక్రియ పూర్తవుతుంది. మధ్యాహ్నం 1 గంట వరకు సర్వర్ పని చేయక పోవడంతో చాలా చోట్ల రైతు సేవా కేంద్రాలలో ఓటీపీలు నమోదు పూర్తి కాలేదు. మధ్యాహ్నం 3 గంటలు తరువాత రావాలని రైతులను వెనక్కి పంపించారు. పెదబొడ్డేపల్లి ఏఎంసీ ఆవరణలో ఉన్న రైతు సేవా కేంద్రంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి ఈ ప్రక్రియ చేపడితే, మధ్యాహ్నం 1 గంటకి కేవలం 20 మందికి మాత్రమే నమోదు చేశారు. ఓటీపీలు అవ్వక మళ్లీ రావాలని రైతులను వెనక్కి పంపేశారు.

ఐదు రోజులే గడువు

ఈ నెల 10 నుంచి ప్రక్రియ మొదలు పెడితే ఇప్పటికి 50 శాతం నమోదు కూడా పూర్తి కాలేదు. డి.పట్టా భూములు, ఆర్‌వోఎఫ్‌ఆర్ భూముల వివరాలు ఓపెన్ కావడం లేదు. నర్సీపట్నం సబ్ డివిజన్‌లో నర్సీపట్నం మండలంలో 9,053 మంది రైతులు ఉంటే, 4,045 మంది నమోదు చేసుకున్నారు. రోలుగుంట ... మిగతా 8వ పేజీలో

ముగ్గురు అధికారుల మెడకు రోడ్డు విస్తరణ ఉచ్చు

మెయిన్ రోడ్డు విస్తరణపై త్వరలో శాఖాపరమైన విచారణ

» ఈఈ, డీఈ, ఏఈలపై క్రమ శిక్షణా చర్యలకు ఉత్తర్వులు



నర్సీపట్నంలోని అబీద్ సెంటర్

నర్సీపట్నం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):
మునిసిపాలిటీ మెయిన్ రోడ్డు విస్తరణ ప్రక్రియ ముగ్గురు మునిసిపల్ అధికారుల మెడకు చుట్టుకుంది. ఆర్ అండ్ బీ పరిధిలోని మెయిన్ రోడ్డు విస్తరణ పనులు ఆ శాఖ అనుమతి లేకుండా మునిసిపల్ అధికారులు చేపట్టడం వివాదాస్పదమైంది. ఐదు నెలల క్రితం స్పీకర్ అయ్యన్నపాత్రుడు రోడ్డు విస్తరణ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆర్ అండ్ బీ, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్ అండ్ బీ విజిలెన్స్ అధికారులు బీటీ రోడ్డు నమూనాలు కూడా సేకరించారు. మునిసిపల్ పబ్లిక్ హెల్త్ విభాగం ఈఈ టి.రాయల్‌బాబు, మునిసిపల్ డీఈఈ నారాయణ, ఏఈ రవిపై క్రమ శిక్షణా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేశ్‌కుమార్ ఈ నెల 20న ఉత్తర్వులు జారీ చేశారు.

రోడ్డు విస్తరణపై త్వరలో విచారణ

మెయిన్ రోడ్డు విస్తరణపై ప్రత్యేక అధికారితో త్వరలో విచారణ జరగనుంది. గత వైసీపీ ప్రభుత్వంలో అబీద్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు రోడ్డు విస్తరణ, అభివృద్ధికి రూ.10.60 కోట్లు మంజూరు చేస్తూ జీవో ఇచ్చిన విషయం తెలిసిందే. రోడ్డు విస్తరణలో నష్టపోతున్న భవన యజమానులకు మునిసిపల్ అధికారులు టీడీఆర్ బాండ్లు ఇవ్వాలని భావించారు. దీనికి అంగీకరించని మెయిన్ రోడ్డుకి ఇరువైపులా ఉన్న స్థల, భవన యజమానులు భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం కోరుతూ హైకోర్టుకు వెళ్లారు. దీంతో రోడ్డు విస్తరణ పనులకు ఆటంకం ఏర్పడింది. అప్పటి వైసీపీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ ప్రభుత్వ భవనాలు అధికంగా ఉన్న అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు రోడ్డుకి ఇరువైపులా డ్రైనేజీ, సెంటర్ డివైడర్, బీటీ రోడ్డు వేయించి అక్కడితో పనులు ఆపేశారు. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోని రోడ్డును మునిసిపల్ అధికారులు విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టడం, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని ఆరోపణల నేపథ్యంలో ముగ్గురు అధికారులు ఇరుక్కున్నారు.

ఏప్రిల్ 20న ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్ష

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలోని ఐదు మోడల్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో విద్యార్థుల ప్రవేశానికి ఏప్రిల్ 20వ తేదీన జిల్లా వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు డీఈవో అప్పారావునాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శ పాఠశాలలు ఉన్న మండలాల్లో ఆయా పాఠశాలల వద్ద ఏప్రిల్ నెల 20వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఈ నెల 24వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డులు ఉపయోగించి పేమెంట్‌ను గేట్ వే ద్వారా పరీక్ష రుసుమును చెల్లించిన తరువాత ఒక జనరల్ నంబర్ కేటాయింపు జరుగుతుందన్నారు. ఆ జనరల్ నంబరు ఆధారంగా www.cse.ap.gov.in లేదా www.apms.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఐదవ తరగతి స్థాయిలో తెలుగు, ఇంగ్లీషు మీడియంలో నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు జిల్లాలో ఉన్న ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, మండల విద్యాశాఖాధికారి, జిల్లా విద్యాశాఖాధికారిని సంప్రతించాలని కోరారు.

నేడు గ్రూప్-2 పరీక్ష

11,029 మంది అభ్యర్థులు
16 కేంద్రాలు

» అభ్యర్థుల ఆందోళనతో భద్రత కట్టుదిట్టం
» కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు


విశాఖలో జాతీయ రహదారిపై బైఠాయించిన అభ్యర్థులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలోని 16 కేంద్రాల్లో ఆదివారం ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకూ, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ గ్రూప్-2 పరీక్ష జరగనున్నది. అభ్యర్థులను ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకూ, మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకూ పరీక్ష హాలులోకి అనుమతిస్తారు. అయితే 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్ ఉంటుంది. ఉదయం 9.45, మధ్యాహ్నం 2.45 గంటల తరువాత వచ్చే అభ్యర్థులకు అనుమతించేది లేదని హాల్ టిక్కెట్లలోనే ఏపీపీఎస్సీ స్పష్టంచేసింది. ఈ పరీక్షలకు 11,029 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, ఏపీపీఎస్సీ అధికారులు తప్ప ఇతర సిబ్బంది సెల్‌ఫోన్లు, అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకువెళ్లకూడదు. పరీక్షల నిర్వహణపై శనివారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

గ్రూప్-2 పరీక్షలకు సంబంధించి జిల్లా యంత్రాంగం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ... మిగతా 8వ పేజీలో

రోడ్డెక్కిన అభ్యర్థులు


ఇసుకతోట జంక్షన్‌లో హైవేపై బైఠాయింపు

» రోస్టర్ విధానంలో సవరణలు చేసిన తరువాతే పరీక్ష నిర్వహించాలని డిమాండ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):
రోస్టర్ విధానంలో సవరణలు చేసిన తరువాతే గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శనివారం రాత్రి వందలాది మంది అభ్యర్థులు నగరంలోని ఇసుక తోట జంక్షన్‌లో జాతీయ రహదారిపై బైఠాయించారు. తొలుత సాయంత్రం ఆరు గంటల సమయంలో ఎంవీపీ కాలనీలోని సర్కిల్ వద్ద ఆందోళనకు దిగారు. అక్కడి నుంచి నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా ఇసుక తోట జంక్షన్‌కు చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. మెయిన్స్ పరీక్షను ... మిగతా 8వ పేజీలో

ఉపమాక వెంకన్న ఉత్సవాలను విజయవంతం చేయాలి

» హోం మంత్రి అనిత


ఉపమాక ఉత్సవ ఏర్పాట్లపై చర్చిస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):
సమష్టిగా పనిచేసి ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సూచించారు. వచ్చే నెల 9వ తేదీ నుంచి స్వామివారి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం ఈ ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. నియోజకవర్గం కూటమి నాయకులతో ఈ సందర్భంగా మాట్లాడారు. టీటీడీ ఉత్సవాలకు సహకరిస్తుందన్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు ... మిగతా 8వ పేజీలో

ఇంకా జగన్ జపమే..

» కూటమి ప్రభుత్వం వచ్చినా మారని అధికారుల తీరు
» 26వ సచివాలయం బోర్డుపై తొలగని మాజీ సీఎం ఫొటో

అనకాపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):
ప్రభుత్వం మారినా అనకాపల్లి పట్టణంలో జీవీఎంసీ సచివాలయ సిబ్బంది మాజీ సీఎం జగన్ జపం వీడలేదు. స్థానిక గవరపాలెంలోని మరిడిమాంబ ఆలయానికి సమీపంలో 25, 26వ వార్డుల పరిధిలోని సచివాలయానికి వైసీపీ పాలనలో ఏర్పాటు చేసిన జగన్ ఫొటోతో ఉన్న బోర్డునే కొనసాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ, వార్డు సచివాలయాలపై జగన్ ఫొటోను తొలగించాలని, రాజకీయ నాయకుల ఫొటోలు అవసరం లేదంటూ స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి ఎనిమిది నెలలు కావస్తున్నా జీవీఎంసీ సచివాలయ సిబ్బంది పాత బోర్డును తొలగించలేదు. కొద్ది రోజుల్లో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల నాయకుల ఫొటోలు తొలగించాలని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. అయినా జీవీఎంసీ సచివాలయ సిబ్బంది స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



అనకాపల్లి జీవీఎంసీ పరిధిలోని 26వ సచివాలయంపై జగన్ ఫొటోతో ఉన్న బోర్డు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

అభ్యర్థి రఘువర్మను గెలిపించండి

- కూటమి శ్రేణులకు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పిలుపు
- విజయం సాధిస్తే ఉపాధ్యాయులకు సేవ చేస్తారని వెల్లడి



కూటమి శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు

రాంబిల్లి/అచ్యుతాపురం/మునగపాక, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి మద్దతుతో బరిలో నిలిచిన పాకలపాటి రఘువర్మను అంతా గెలిపించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పిలుపు నిచ్చారు. మండలంలోని హరిపురంలో గల జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి కూటమి నేతల సమావేశంలో మాట్లాడారు. ఎలమంచిలి నియోజకవర్గంలో 325 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు. రఘువర్మ విజయానికి కూటమినేతలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి ఉపాధ్యాయులంతా గెలిపిస్తే, వారి సమస్యల పరిష్కారానికి ఆయన విశేషంగా కృషి చేస్తారన్నారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ, జనసేన పార్టీ జిల్లా నాయకుడు రమణాజీ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సన్యాసినాయుడు, నాయకులు మధు, రాంబిల్లి, అచ్యుతాపురం ఎలమంచిలి, అచ్యుతాపురం మండలాల కూటమి నేతలు శ్రీనివాసరావు, భైలపూడి శ్రీరామదాసు, వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర తదితరులు పాల్గొన్నారు.

ఇదిలావుంటే, ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మకు అంతా మద్దతు పలకాలని ఏపీటీఎఫ్ ప్రతినిధులు కోరారు. అచ్యుతాపురం మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం పర్యటించి రఘువర్మకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, రమణాజీ, మోటూరు త్రినాథస్వామి, ఫాతిమా బేగం, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు. అలాగే, కూటమి బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మను గెలిపించాల్సింగా టీడీపీ శ్రేణులు శనివారం ప్రచారం నిర్వహించారు. మునగపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి రఘువర్మకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, మాజీ ఎంపీపీ ఆడారి మంజు, దాడి ముసిలి నాయుడు, పెంటకోట శ్రీరామ్మూర్తి, ఆడారి సూర్య చంద్రరామారావు తదితరులు పాల్గొన్నారు.

టమాటా రైతులు ఆందోళన చెందవద్దు

- రైతు బజార్లలో పండ్లు విక్రయానికి చర్యలు
- కిలో రూ. 12 చొప్పున కొనుగోలు
- జిల్లా ఉద్యానవన శాఖాధికారి ప్రభాకర్


రైతులు పండించిన టమాటాను పొలంలో పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారి ప్రభాకర్

అచ్యుతాపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రైతు బజార్ల ద్వారా టమాటా విక్రయించడానికి చర్యలు చేపట్టామని జిల్లా ఉద్యానవన శాఖాధికారి ప్రభాకర్ తెలిపారు. మండలంలోని చీమలాపల్లిలో శనివారం ఆయన టమాటా సాగుచేసే రైతులను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టామాటా పండించే రైతులెవరూ దిగులు చెందాల్సిన పనిలేదన్నారు. రైతు బజార్లలో కిలో పన్నెండు రూపాయలకు కొనుగోలు చేస్తున్నారని, రైతులంతా దగ్గరలో ఉన్న రైతుబజారులకు పంపాలని సూచించారు. సంతల్లో వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని, రైతులు వ్యాపారులకు కాకుండా నేరుగా రైతుబజారుల్లో విక్రయించాలని ఆయన తెలిపారు. రెండు రోజుల్లో టమాటా ధర పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మహిళా మిత్ర ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ చైర్మన్ కొల్లి సురేశ్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

వాతావరణ అధారిత పంటల సరళిపై దృష్టి సారించాలి

- సలహా సంఘ సమావేశంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు


సమావేశంలో మాట్లాడుతున్న బీసీటీ కేవీకే చైర్మన్ శ్రీరామూర్తి

రాంబిల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సరళిలో కూడా కొద్దిపాటు మార్పులు చేసుకోవాల్సిన అవశ్యకత ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని హరిపురం బీసీటీ కృషివిజ్ఞాన కేంద్రంలో శనివారం శాస్త్రీయ సలహా సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి పరిశోధనా స్థానం పరిశోధనా సహాయాధికారి డాక్టర్ సిహెచ్.ముకుందరావు మాట్లాడుతూ చీడపీడలు తట్టుకొనే రకాలపై శ్రద్ధపెట్టాలని, ఖర్చు తగ్గించే యాంత్రీకరణపై మరింత దృష్టిసారించాలని సూచించారు. సహాయ విస్తరణ సంచాలకులు డాక్టర్ వి.విశాలాక్ష్మి మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రస్తుత పరిస్థితులు, సమస్యలపై లోతైన అధ్యయం కావాలని, అందుకు అనుగుణమైన పరిష్కారాలను శాస్త్రీయంగా సోధించవలసి ఉందని వివరించారు. చింతపల్లి పరిశోధనా స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ ఎ.అప్పలస్వామి మాట్లాడుతూ సాంప్రదాయేతర పంటలలో నాణ్యమైన దిగుబడి తీయగల ఆవాలు, కొమ్ము శనగ వంటి పంటలను ప్రోత్సహించాలన్నారు. విశాఖపట్నం మత్స్య పరిశోధనా స్థానం నుంచి డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ చేపల పెంపకం, విలువ ఆధారిత ఉత్పత్తులపై సూచనలు చేశారు. జిల్లాలోని వ్యవసాయ, అనుబంధ రంగాల నుంచి సుబ్రహ్మణ్యం, ఉమాప్రసాద్, విజేత, సౌజన్య, లక్ష్మి, శంకర్ తదితరులు జిల్లాలోని పంటల సరళి, పంటలలో సమస్యలపై చర్చించారు. బీసీటీ కేవీకే చైర్మన్ బి.శ్రీరామూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ కుమారి, బిందు, డాక్టర్ రాజ్ కుమార్, ఆకాశవాణి నుంచి వెంకటరమణ, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ శిబిరం ప్రారంభం

రాంబిల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి హైస్కూల్‌లో శనివారం మండల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శనివారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఎంఈవోలు ఎం.సూర్యారావు, బి.సూర్యనారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. రిసోర్స్‌పర్సన్లు జి.నర్సింగరావు, కె.కిశోర్,బి. మనోహర్‌లు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

నేవీ పునరావాస కాలనీ సమస్యలపై వినతి

రాంబిల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : నేవీ పునరావాస కాలనీ నాయకులు ప్రభుత్వం ముందు ఉంచిన న్యాయబద్ధమైన డిమాండ్లు పరిష్కరించాలని శనివారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను కోరారు. ఈ మేరకు హరిపురంలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వేల్పుగొండుపాలెం, దేవళ్ళపాలెం, రేవువాతాడ, పిసినిగొండుపాలెం గ్రామాలకు చెందిన పునరావాస కాలనీ నాయకులు మాట్లాడుతూ తమ గ్రామాల్లో సాంప్రదాయ వృత్తులను చేసుకుంటూ కుటుంబాలను పోషించుకునేవారమన్నారు. తమ ప్రాంతంలో ఎస్ఏవీబీ ప్రాజెక్టు ఏర్పాటుతో రాంబిల్లి పరిధిలోని నేవీ పునరావాస కాలనీకి తరలించారన్నారు. నాటి నుంచి ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వాపోయారు. ఎస్ఏవీబీలో పీడీఎఫ్ నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, 2012 సంవత్సరానికి పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ మేజర్లుగా గుర్తించి ప్యాకేజీ ఇప్పించాలని, మేజర్లు అయిన ఆడపిల్లలకు ప్యాకేజీ ఇవ్వాలని, మేజర్లుగా గుర్తించిన వారికి ఐదు సెంట్లు ఇచ్చి, ఆర్.నంబరు మంజూరు చేయాలని కోరారు. అలాగే, నిర్వాసితులకు ఇళ్ల స్థలు రిజిస్ట్రేషన్ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని, నిర్వాసిత మహిళలకు గంపలు ప్యాకేజీ మంజూరు చేయాలని, అన్ని అర్హతలు ఉండి పునరావాస కాలనీలో స్థలం, ప్యాకేజీ ఇవ్వని వారిని ఆదుకోవాలని కోరారు. వీటిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ నేవీ నిర్వాసిత పునరావాస కాలనీని సందర్శించి అందరితో సమావేశం నిర్వహిస్తానన్నారు. అనంతరం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వివరించారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

మునగపాక, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పాటిపల్లి గ్రామంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నామని ప్రిన్సిపాల్ పీపీఎస్ శ్రీలక్ష్మి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి ఈ నెల 25వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చునని వివరించారు.

నలుగురు మైనర్లపై కేసు

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండల ఏఎల్‌పురంలో దొంగతనానికి పాల్పడిన నలుగురు మైనర్లపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. ఏఎల్‌పురానికి చెందిన గుడివాడ అప్పలనాయుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెనుక గ్రిల్స్‌కి ఉన్న తాళాలు విరగ్గొట్టి దొంగలు చొరబడి చోరీ చేశారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేయగా అదే గ్రామానికి చెందిన నలుగురు మైనర్లను గుర్తించి, వారి నుంచి వస్తువులను స్వాధీనపర్చుకున్నారు. నలుగురిని అదుపులోకి తీసుకొని, విశాఖపట్నం జువైనల్ జస్టిస్ బోర్డు ముందు హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ లక్ష్యం

- జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి


మునగపాక సంత ప్రాంతంలో చెత్త తొలగింపును పరిశీలిస్తున్న డీపీవో

మునగపాక, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారిణి ఆర్.శిరీషారాణి సూచించారు. పారిశుధ్య పనుల్లో భాగంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న సందర్భంగా మునగపాకలో శనివారం పర్యటించారు. పారిశుధ్య పనుల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో గల ఇళ్ల వద్దకు పారిశుధ్య సిబ్బంది వెళ్లి చెత్త సేకరణ చేస్తున్నారన్నారు. దానిని సందప కేంద్రాలకు తరలిస్తున్నట్టు చెప్పారు. అనంతరం సంపద కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారీ యూనిట్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎంపీడీవో ఎం.ఉషారాణి, సర్పంచ్ దిమ్మల అపారావులతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఎలమంచిలి : మండలంలోని ఏటికొప్పాక, పులపర్తి గ్రామాల్లో శనివారం పంచాయతీ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పారిశుధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించారు. ఆయా పంచాయతీల అధికారులు ప్రసాద్, సత్యనారాయణలు మాట్లాడుతూ ఇళ్లలో చెత్తను సిబ్బందికి అందించాలన్నారు. .

రాంబిల్లి : రాజుకోడూరులో శనివారం చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జయమాధవి మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇళ్లకు వచ్చే పారిశుద్ధ సిబ్బందికి తడి, పొడి చెత్తను వేర్వేరు బుట్టల ద్వారా అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రాజులు తదితరులు పాల్గొన్నారు.


ఎలమంచిలి మండలం పులపర్తిలో చెత్త సేకరణ

ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే ఉపాధి కూలీలకు వేతనాలు: పీడీ

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కోటవురట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే ఉపాధి కూలీల వేతనాల పంపిణీకి చర్యలు తీసుకుంటామని ఉపాధి పథకం ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్ పూర్ణమాదేవి తెలిపారు. 'కూలి డబ్బులకు ఉపాధికూలీలు నిరీక్షణ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి 'లో శనివారం ప్రచురించిన కథనానికి ఆమె స్పందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా ఉపాది కూలీలు వేతనాలు బకాయిలు పెండింగ్ ఉన్నాయన్నారు. కోటవురట్ల మండలంలో కూలీలకు ఆరువారాలు వేతనాలు రూ.1. 53లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేసిన వెంటనే కూలీల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని ఆమె స్పష్టంచేశారు.

శివాలయాలకు త్రివేణి సంగమం జలాలు


కుమారపురంలో పవిత్ర జలాలను అందజేస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): దాన ధర్మ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహాకుంభ మేళా జరుగుతున్న ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలోని పవిత్ర జలాలను శివాలయాలకు పంపిణీ చేస్తున్నట్టు ట్రస్టు సభ్యుడు నీలాపు వెంకటరెడ్డి తెలిపారు. ఈ పవిత్ర జలాల బాటిళ్లను శనివారం అందజేశారు. 144 ఏళ్లకోసారి జరిగే మహాకుంభ మేళా మొదటి రోజున త్రివేణి సంగమంలోని పవిత్ర జలాలను తీసుకువచ్చి శివాలయాలలో మహా శివ రాత్రికి అభిషేకాలు చేయనున్నట్టు చెప్పారు. కోటవురట్లలో 15, నాతవరంలో 15 ఎస్. రా య వరంలో 15, నక్కపల్లిలో 15, పాయకరావుపేటలో 20 శివాలయాలకు వీటిని అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కట్టా వీరబాబు, వీహెచ్ఎస్ పల్లెల జోగారావు, పరమేశ్వరరావు, సూర్యారావు, రాఘవ , కొడమటి చినబాబు, అడపా భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతి శిక్షణతో మేలు


శిక్షణ ఇస్తున్న ఎంఈవో-2 నూకరాజు

నక్కపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో శనివారం ఎంఈవో -2 వేమగిరి నూకరాజు పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సలహాలు ఇచ్చారు. శిక్షణతో బోధన మెరుగుపడుతుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన నమూనాలను ఆయన పరిశీలించారు. విద్యావిధానంలో చేపడుతున్న సంస్కరణల్లో భాగంగా జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

కొండగెడ్డపై నిర్మాణ పనులు ఆపాలి

- ఇరిగేషన్ ఏఈఈ శ్రీరామ్మూర్తి ఆదేశం


పి.ఎల్.పురంలో కొండగెడ్డను పరిశీలిస్తున్న ఏఈఈ శ్రీరామ్మూర్తి, తదితరులు

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 22: మండల పరిధి పి.ఎల్.పురం గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా కొండగెడ్డపై నిర్మిస్తున్న కల్వర్టులు, రోడ్డు పనులను నిలిపివేయాలనిసాగునీటి శాఖ ఏఈఈ జి. శ్రీరామ్మూర్తి ఆదేశించారు. గ్రామ పంచాయతీ , ఎన్ఆర్‌జీఎస్ నిధులతో ఈ గెడ్డపై రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. ఏఈఈ శనివారం ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. కొండల్లో నీరు గెడ్డ నుంచి జోడి చెరువులోకి చేరుతుంది. అయితే, రోడ్డు నిర్మాణ పనులలో భాగంగా కొండగెడ్డను కొంతవరకు ఆక్రమించి రోడ్డు నిర్మిస్తున్నట్టు తెలియడంతో ఈ పనులను నిలిపి వేయాలని ఆయన కోరారు. ఏ శాఖ ద్వారా ఈ రోడ్డు నిర్మిస్తున్నారు, ఎవరి అనుమతులు తీసుకున్నారో తెలియజేయాలని నీటిపారుదల శాఖ ఏఈఈ కోరారు. కొండగెడ్డపై ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా నీటిపారుదల శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కొండ గెడ్డలో నీరు పారుదలకు ఎటువంటి అడ్డంకులు లేకపోతే గ్రామస్థుల ద్వారా దరఖాస్తు చేసుకుంటే తాము పరిశీలించి అనుమతులు ఇస్తామన్నారు. అంతవరకు రోడ్డు పనులను ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నాగం వెంకటరత్నం, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


హోం మంత్రి అనితకు కరపత్రాలిస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

నక్కపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ గెలుపు కోసం ఏపీటీఎఫ్ ప్రతినిధులు ప్రచారం చేశారు. శనివారం సాయంత్రం సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మారావు, సెక్రటరీ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో హోం మంత్రి అనితను కలిశారు. బ్యాలెట్ నమూనా పత్రాలను మంత్రికి అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు త్రినాథ్, ఏడిద కృష్ణ, అప్పలరాజు, సునీల్, శ్రీనివాసులు, లోవరాజు పాల్గొన్నారు.

ఏపీయుడబ్ల్యూజే డైరీ ఆవిష్కరణ

నక్కపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏపీయూడబ్ల్యూజే 2025 డైరీని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత శనివారం సాయంత్రం ఉపమాక ఆలయం వద్ద ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా సెక్రటరీ కోరాడ చంద్రరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం హోం మంత్రి అనిత, కొందరు పెద్దలకు డైరీలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే సంఘ ప్రతినిధులు శ్రీనివాస్, సత్యనారాయణ, చిట్టిబాబు, రాంబాబు,హరిబాబు, లోవరాజు, సత్యనారాయణ, రమేశ్, తాతాజీ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ శాంతి ర్యాలీ

నర్సీపట్నం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ నర్సీపట్నం, విశాఖపట్నం శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఏటా ఫిబ్రవరిని శాంతి మాసంగా రోటరీ క్లబ్ నిర్వహిస్తుంది. అందులో భాగంగా శనివారం ఈ ర్యాలీలో రోటరీ క్లబ్ పూర్వపు గవర్నర్ రావూరి వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పి.కొండలరాయుడు, పెనుగొండ రమేశ్, వెలగానారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణకు స్పెషల్ డ్రైవ్


శ్రీరాంపురంలో మాట్లాడుతున్న ఈవోఆర్డీ చంద్రశేఖరరావు

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఇంటింటి నుంచి చెత్త సేకరణపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా సచివాలయాల సిబ్బంది తడి చెత్త, పొడి చెత్తపై మహిళలకు అవగాహన కల్పించారు. శ్రీరాంపురం, పాల్తేరు, ఎస్.నర్సాపురం, పెదరాంభద్రపురం గ్రామాలలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ఈవోపీఆర్‌డీ సి.హెచ్. చంద్రశేఖరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతీ ఒక్కరూ తడి చెత్తను, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలన్నారు. వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ కాకుండా నిర్దేశిత ప్రదేశాలలో గానీ, లేదా ఇళ్ల వద్ద వచ్చే హరిత రాయబారులకు అందించాలన్నారు.వారు చెత్తను సంపద తయారీ కేంద్రానికి తీసుకు వెళ్తారన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తే అందరూ ఆరోగ్యంగా ఉం టామన్నారు. సత్యవరం, పెంటకోట, కేశవరం, పీల్తేరు, మంగవరం, పెదరాంభద్రపురం, వెంకటనగరం, పాల్మన్‌పేట, నామవరం, గుంటపల్లి తదితర గ్రామాల్లో ఇంటింటి నుంచి చెత్త సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వైవి. సత్యనారాయణ, నాయుడు, రామగోవిందు, దుర్గాప్రసాద్, మల్లికార్జు నాచారి తదితరులు పాల్గొన్నారు.


బీకేపల్లిలో చెత్తను సేకరించి రిక్షాలో వేస్తున్న ఈవోపీఆర్‌డీ , సిబ్బంది

నక్కపల్లి: మండలంలోని 33 పంచాయతీల్లో శనివారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నక్కపల్లి, ఉపమాక, వేంపాడు, ఉద్దండపురం తదితర గ్రామాల్లో ఈ పనులను ఎంపీడీవో సీతారామరాజు పర్యవేక్షించారు. ఈ రెండు రోజులపాటు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన చెప్పారు. గ్రామ సెక్రటరీలు పాల్గొన్నారు.

చెత్తసంపదపై అందరూ దృషిసారించాలి

కోటవురట్ల: పంచాయతీల్లో అధికారులు శానిటేషన్ సిబ్బంది ఇంటింటికి తిరిగి చెత్తసేకరించారు. బీకేపల్లి, యండపల్లిలలో ఎంపీడీవో కాశీవిశ్వనాథం, ఈవోపీఆర్‌డీరఘు పారిశుధ్య పనులను పరిశీలించారు. పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించి వీటిని వినియోగంలోకితీసుకు రావాలని సూచించారు. ఎరువులు తయారీతో ఆదాయం పొందాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీచేశారు.

క్రీడలతో గుర్తింపు, మంచి ఆరోగ్యం


టాస్ వేస్తున్న సీఐ కుమారస్వామి

నక్కపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించే వారికి చక్కని గుర్తింపుతోపాటు, మంచి ఆరోగ్యం చేకూరుతుందని నక్కపల్లి, అడ్డరోడ్డు సీఐలు కె.కుమారస్వామి, ఎల్.రామకృష్ణ అన్నారు. మండలంలోని రాజయ్యపేట గ్రామంలో నూకతాత పండుగ సందర్భంగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌కు వారు హాజరయ్యారు. క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. ఎంతో మంది క్రీడాకారులు సామాన్య స్థాయి నుంచి అత్యున్నత స్థాయికి ఎదిగారని చెప్పారు. యువత వ్యసనాల జోలికి వెళ్లకుండా ఇటువంటి క్రీడా సాధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పిక్కిస్వామి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్రజ్ఞ వికాస పరీక్షలు


పేపర్ విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేత బాలాజీ, ఉపాధ్యాయిని వరలక్ష్మి

ఎస్. రాయవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్.రాయవరం, నక్కపల్లి మండలంలోని పలు పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు శనివారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ప్రజ్ఞ వికాస పరీక్షలు నిర్వహించారు. కొరుప్రోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ ప్రశ్నపత్రాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం. బాలాజీ, ఉపాధ్యాయిని వరలక్ష్మితో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించడంతో పాటు వారిలో పరీక్షలపై నెలకొన్న భయాన్ని పోగొట్టం కోసం ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రెండు మండలాల్లో ఈ ప్రజ్ఞ వికాస పరీక్షకు సుమారు 500 మంది పాల్గొన్నారన్నారు. విద్యార్థులు వ్యసనాలకు అలవాటు పడకుండా ఉండేలా పలు సంస్కృతిక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శిరీష, అశ్విని, ప్రసాద్, కృష్ణ, నూకరాజు, సురేశ్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

'గాదె'కు మద్దతుగా ప్రచారం

నక్కపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో వున్న గాదె శ్రీనివాసులనాయుడు గెలుపు కోసం పీఆర్‌టీయు సంఘ ప్రతినిధులు ప్రచారం చేశారు. పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులను శ్రీనివాసుల నాయుడికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రతినిధులు రమణ, శివాజీ, ఆచార్యులు, చలపతిరావు, డీఈఎస్ రావు, తదితరులు పాల్గొన్నారు.ఫొటో:22ఎన్‌కేపీ10: హోం మంత్రిని కలిసిన ఏపీటీఎఫ్ ప్రతినిధులు

ఎన్‌సీసీ, స్కౌట్స్‌తో క్రమశిక్షణ

▸▸ డీఈవో అప్పారావునాయుడు



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఈవో అప్పారావునాయుడు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, ఎన్‌సీసీ, స్కౌట్స్ ఎన్ఎస్ఎస్ వంటి విభాగాల్లో శిక్షణ పొందడం అవసరమని డీఈవో గిడ్డి అప్పారావునాయుడు అన్నారు. అనకాపల్లిలో జాతీయ థింకింగ్ డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ముందుగా స్కౌట్స్ వ్యవస్థాపకులు లార్డ్ రోబెర్ట్ పావెల్, బేడన్ పావెల్ దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ, స్కౌట్స్ వల్ల మానసిక ఆనందంతో పాటు ఆత్మస్థైర్యం, శరీరక దృఢత్వం, క్రమశిక్షణ వంటి మంచి లక్షణాలు అలవడతాయన్నారు. అలాగే, ఉన్నత విద్య, ఉద్యోగాలకు దోహదపడతాయని వివరించారు. ఎన్టీఆర్ స్టేడియం నుంచి మెయిన్ రోడ్డు, రింగురోడ్డు మీదుగా ఎన్టీఆర్ మార్కెట్ యార్డు వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి కొణతాల రత్నకుమారి, పి.సావిత్రి, రాజేశ్వరి, ఎ.గురుమూర్తి, బేగం, షరీఫ్‌లతో పాటు ఎంఈవోలు, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే సమన్వయ కమిటీ లక్ష్యం



అర్జీదారులతో మాట్లాడుతున్న అధికారులు

కశింకోట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : అపరిష్కృత సమస్యలు పరిష్కరించడమే మండల లెవెల్ కో-ఆర్డినేటర్ కమిటీ లక్ష్యమని మండల ప్రత్యేకాధికారిణి ఎల్.వి.సుభాషిణి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ప్రజల నుంచి అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై రెండు ఫిర్యాదు అందాయని, వాటిపై చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, ఎంపీడీవో రవి కుమార్, ఏఎస్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య, వ్యవసాయరంగాలపై కేంద్రం చిన్నచూపు



నెహ్రూచౌక్‌లో ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌ను అంతా వ్యతిరేకించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.వెంకటరమణ పిలుపునిచ్చారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా శనివారం ఇక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు అండగా నిలిచిన ఉపాధి హామీ పథకానికి రూ.60వేల కోట్లు బడ్జెట్‌లో కోత విధించారన్నారు. అలాగే విద్య, వైద్య, వ్యవసాయరంగానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించారని పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం కలిగే విధంగా బడ్జెట్‌లో అనేక రాయితీలు కల్పించారని ఆరోపించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీల అమలుకు ఎటువంటి కేటాయింపులు చేయని ఈ బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి ఎలా దోహదపడుతుందని ప్రశ్నించారు. ఈ ధర్నాలో సీపీఎం నాయకులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యనారాయణ, సీపీఐ నాయకులు ఆర్.దొరబాబు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు స్టాపర్ బోర్డులు బహూకరణ



సీఐకు స్టాపర్ల బోర్డులు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పోలీస్ స్టేషన్‌కు క్రెడిట్ ఆక్సిస్ గ్రామీణ్ లిమిటెడ్ సంస్థ ఐదు స్టాపర్ బోర్డులను సమకూర్చింది. సంస్థ విశాఖ డివిజనల్ మేనేజర్ బి.వెంకటరమణ ఈ బోర్డులను శనివారం సీఐ టీవీ విజయ్‌కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ లైజన్ ఆఫీసర్ పి.రమేష్‌బాబు, ఏరియా మేనేజర్ కె.రామచంద్రరావు, బ్రాంచ్ మేనేజర్ పి.ప్రసాద్, పట్టణ ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్చెయ్యపేటలో ప్రభుత్వ భూములు కబ్జా!



పునాది నిర్మాణానికి అక్రమంగా గోతులు తీసిన దృశ్యం

కొత్తూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం సుందరయ్యపేట పంచాయతీ అచ్చెయ్యపేటలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీతానగరం రెవెన్యూ పరిధి సర్వే నంబరు 511లో వైసీపీ ప్రభుత్వ హయాంలో 76 మంది నిరుపేదలకు పట్టాలు మంజూరు చేసి ఇళ్లు కూడా నిర్మించారు. ఆ పక్కనే ఖాళీగా ఉన్న స్థలాన్ని కొంత మంది వైసీపీ నాయకులు ప్రభుత్వ భూములను చదును చేసి రాత్రి సమయంలో పునాదులు నిర్మించుకుంటున్నారని అక్కడి వారు చెపుతున్నారు. ఇంతలా జరగుతున్నా రెవెన్యూ అధికారుల్లో స్పందన లేకపోవడం ఏమిటని ప్రశిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

రోడ్డు పక్కనే ఇళ్లు.. సమస్యలపై గొల్లు

▸▸ జగనన్న కాలనీలో అసౌకర్యాల నడుమ నివాసం ▸▸ కానరాని వీధి రోడ్లు, కాలువలు ▸▸ ఇళ్ల మధ్యే మురుగు తిష్ఠతో అవస్థలు



కాలనీలో వీధి రోడ్లు లేని దృశ్యం



పరవాడలో తహసీల్దార్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న జగనన్న కాలనీ

పరవాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ తహసీల్దార్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న జగనన్న కాలనీలో సమస్యలు తిష్ఠ వేశాయి. కాలనీలో ఏర్పాటై రెండేళ్లు గడుస్తున్నా నేటికీ ఇక్కడ పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించలేదు. సుమారు 60 కుటుంబాలకు పైగా ఇక్కడ నివాసం ఉంటున్నాయి. వసతులను సమకూర్చడంలో గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. ఈ కారణంగా కాలనీవాసులు అవస్థల నడుమ కాలం వెళ్లదీస్తున్నారు. ముఖ్యంగా రోడ్లు ఏర్పాటు చేయకపోవడంతో పాటు కాలువల నిర్మాణం కూడా చేపట్టలేదు. వాడుకనీరంతా ఇళ్ల మధ్యే నిల్వ ఉండిపోతుంది. రోజుల తరబడి ఇలా ఉంటుండడం వల్ల భరించలేని దుర్వాసన వెదజల్లుతోందని కాలనీ ప్రజలు చెబుతున్నారు. దీనివల్ల ఈగలు, దోమలు వృద్ధి చెంది రాత్రివేళ కంటిపై కనుకు లేకుండా చేస్తున్నాయి. వీటి వల్ల పలువురు జ్వరాల బారిన పడుతున్నారు. వీధి రోడ్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల రాళ్లపై నుంచి నడవలేని పరిస్థితి దాపురించింది. వృద్ధులు, చిన్న పిల్లల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇక్కడి సమస్యలను గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి వీధిరోడ్ల నిర్మాణంతో పాటు కాలువలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ఇళ్ల మధ్య నిలిచిపోయిన మురుగు

జిల్లాలోని 646 గ్రామాల్లో చెత్త సేకరణకు స్పెషల్ డ్రైవ్

▸▸ జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి వెల్లడి

▸▸ తుమ్మపాల, రేబాక గ్రామాల్లో పారిశుధ్య పనులు పరిశీలన



తుమ్మపాలలో పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో శిరీషారాణి



కూండ్రంలో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న ప్రత్యేకాధికారిణి సుబ్బలక్ష్మి



పెదముషిడివాడలో చీపుర్లుపట్టి ఊడ్చుతున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు తదితరులు

తుమ్మపాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పారిశుధ్య సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించినట్టు డీపీవో ఆర్.శిరీషారాణి తెలిపారు. చెత్త సేకరణపై నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌ను శనివారం అనకాపల్లి మండలం తుమ్మపాల, రేబాక గ్రామాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న 646 గ్రామాల్లో చెత్త సేకరణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. పారిశుధ్య కార్మికులు చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలిస్తున్నట్టు చెప్పారు. ఇళ్లలోని తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుధ్య సిబ్బందికి అందించాలని ప్రజలకు సూచించారు. గ్రామ వీధులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రసాద్, తుమ్మపాల పంచాయతీ ఈవో ఈశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, రేబాక పంచాయతీ పరిధి కాపుశెట్టివానిపాలెం జాతీయ రహదారికి ఆనుకొని సర్వే నంబరు 11లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. ఈ మేరకు డీపీవో శిరీషరాణికి వినతిపత్రం అందజేశారు.

కొత్తూరు : పరిసరాల పరిశుభ్రతకు అంతా అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మండల ప్రత్యేకాధికారిణి సుబ్బలక్ష్మి సూచించారు. కుంచంగి, కూండ్రం గ్రామాల్లో శానిటేషన్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలంతా ఆరోగ్యం ఉంటారన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్లకు ఏ విధంగా అందజేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎ.శైలజ, ఎ.లక్ష్మి, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక పారిశుధ్యం నిర్వహణ కార్యక్రమంలో శనివారం పెదముషిడివాడలో నిర్వహించిన పారిశుధ్య పనులను పరిశీలించి మాట్లాడారు. ఆరు బయట చెత్తను వేయరాదన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పంచాయతీ క్లాప్‌మిత్రలకు అందజేయాలన్నారు. అనంతరం సంపద కేంద్రాన్ని సందర్శించి మొక్కలు నాటారు. ఇన్‌చార్జి ఎంపీడీవో కె.ధర్మారావు, సచివాలయ సిబ్బందితో పాటు అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కశింకోట : పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎంపీడీవో రవి కుమార్ హెచ్చరించారు. తాళ్లపాలెంలో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శులు రామచంద్రరావు, సత్యారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో మండల పరిషత్ సమావేశ మందిరంలో సమావేశం మండల ప్రత్యేకాధికారిణి ఎల్.వి.సుభాషిణి, ఎంపీడీవో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

వీరాంజనేయ ఆలయంలో విశేష పూజలు



మాజీ డిప్యూటీ సీఎం బూడికి జ్ఞాపిక అందిస్తున్న గ్రామస్థులు

సబ్బవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : మొగలిపురం గ్రామ శివారులో నిర్మించిన వీరాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం ఈనెల 26న జరగనుంది. ఇందులో భాగంగా శనివారం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, వైసీపీ నాయకులు గండి రవికుమార్, యడ్ల నాయుడు, ఐడీ బాబు, గండి ముత్యాలనాయుడు, రమేశ్, నవీన్‌లతో పాటు పలు గ్రామాల ప్రజలు దర్శించుకున్నారు. బూడిని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.

బాల గణపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే 'కొణతాల'



కొణతాలకు ప్రసాదం అందిస్తున్న అర్చకుడు

కొత్తూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి బాల గణపతి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారిని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో కోలాహల వాతావరణం నెలకొంది. కొణతాలను నిర్వాహకులు సత్కరించారు.

చింతలపాలెం దర్గాలో చందనోత్సవం



కశింకోట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : చింతలపాలెం గ్రామంలో ఉన్న దర్గాలో చందనోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్ దర్గాలో బాబాను దర్శించుకొని ప్రార్థనలు చేశారు. ముస్లిం మత పెద్దలు ఆయనను సత్కరించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా విస్తృత ప్రచారాలు



తాళ్లపాలెం పాఠశాలలో కరపత్రాలు అందిస్తున్న పీలా గోవింద



కొప్పాకలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్సీ బుద్ధ

కశింకోట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ విజయానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని తాళ్లపాలెం అంబేడ్కర్ గురుకులం, బయ్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తేగాడ మోడల్ స్కూల్, నర్సింగబిల్లి జడ్పీ హైస్కూల్‌లలో శనివారం ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. టీడీపీ నాయకులు కాయల మురళీ, గొంతిన శ్రీనివాసరావు, ఉగ్గిన రమణమూర్తి, ఉల్లింగల రమేష్, రాజు, తాతిలనాయుడు, రమణారావు, సోమేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్/తుమ్మపాల : ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న రఘువర్మను గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు కోరారు. అనకాపల్లి మండలం కొప్పాక, తారకరామ కాలనీల, మామిడిపాలెం పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి మాట్లాడారు. రఘువర్మను గెలిపిస్తే సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తారన్నారు. రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు మాదంశెట్టి నీలబాబు, టీడీపీ నాయకులు సాలాపు సూరిఅప్పారావు, బొండా సూకరాజు, సర్పంచ్ పూడి పరదేశినాయుడు, నాయకులు చెక్కల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యం : గాదె

అనకాపల్లి టౌన్ : ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యమని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. ఇక్కడి నూకాంబిక ఆలయ సమీపంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బుద్ధ కాశీ, పీఆర్‌టీయూ ప్రతినిధుల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జరిగిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీ నాథ్, ప్రధాన కార్యదర్శి పెద్దినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ విశ్వేశ్వరరావు, ఎస్‌టీయూ అధ్యక్షుడు రవి పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

వేసవిలో తాగు నీటి సమస్య పరిష్కారానికి ప్రణాళికలు

ఎస్.శేఖర్, ఈఈ, తాగునీటి విభాగం



వేసవిలో అనకాపల్లిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకుంటున్నాం. ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశాం. నిధులు మంజూరైన వెంటనే పనులను ప్రారంభిస్తాం.

ప్రశ్న : వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీటి సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జవాబు : వేసవిలో పట్టణ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే రూ.60 లక్షలతో ప్రతిపాదనలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. నిధులు మంజూరైన వెంటనే పైపులైన్ల లీకేజీలను అరికడతాం. శారదానదిలో నీటి నిల్వకు ఇసుకబస్తాలతో బండ్ ఏర్పాటు చేయడం, మినీ రక్షిత మంచినీటి పథకాలకు సంబంధించిన మోటార్లు, తదితరాలకు మరమ్మతులు చేపట్టడం వంటివి చేస్తాం.

ప్రశ్న : నీరు అందని ప్రాంతాల్లో పరిస్థితి ఏమిటి?

జవాబు : ప్రజలకు పైపులైన్ ద్వారా తాగునీరు సరిగా అందని ప్రాంతాలకు రోజూ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తాం. అలాగే ఎత్తైన ప్రాంతాల్లోకుళాయిల ద్వారా నీరు సమృద్ధిగా అందేందుకు పటిష్టమైన చర్యలు చేపడతాం.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం



గౌరీపరమేశ్వరులను దర్శించుకుంటున్న పీలా

కశింకోట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి వెలమపేటలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆది దంపతులకు వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్ తదితరులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

'విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కారాదు'



మాట్లాడుతున్న సైకాలజిస్టు సంజన

కొత్తూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాలలో విద్యార్థులకు మానసిక ఒత్తిడిపై గెస్ట్ లెక్చర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రముఖ సైకాలజిస్టు ఎ.సంజన మాట్లాడుతూ యువత చిన్నచిన్న విషయాలకు వారి విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వం మంచిదేగానీ పోటీలో మానసిక ఒత్తిడికి గురి కాకూడదని వివరించారు. డాక్టర్ జి.జయబాబు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి విషయం పట్ల మంచి అవగాహన పెంచుకోవాలన్నారు. కళాశాల సూపరింటెండెంట్ పి.అను రాధ, వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్‌కుమార్, మహిళా సాధికారిత కో-ఆర్డినేటర్ జె.సామ్రాజ్యం, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు ఎ.సూరిబాబు, బి.ఎం.వి.పి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.


చింతలపూడి అంగన్‌వాడీలో కూరగాయల సాగును పరిశీలిస్తున్న సూపర్‌వైజర్


ఆనప పాదుకు పండిన కాయ


పోషకవాటికలో పండిన కూరగాయలతో ఆయ

అంగన్‌వాడీల్లో పోషణ వాటికలు

అంగన్‌వాడీలు చిన్నారులకు విద్యా బోధనలందించడంతోపాటు నందనవనాలుగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ కేంద్రాల ఆవరణలోని ఖాళీ స్థలాల్లో సేంద్రీయ పద్ధతిలో కూరగాయల సాగును ప్రోత్సహిస్తోంది. ఇందుకు ఒక్కో కేంద్రానికి రూ.10 వేల చొప్పున అందిస్తోంది. వచ్చిన ఫలసాయం గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్నారు. వారి ఆరోగ్య సంరక్షణకు దోహపడున్నారు.

- కేంద్రాల ఆవరణల్లో కూరగాయల సాగు
- ఫలసాయంతో చిన్నారులకు, బాలింతలకు ఆహారం
- ప్రభుత్వ ప్రోత్సాహం.. రూ.10వేల చొప్పున మంజూరు
- కొయ్యూరు ఐసీడీఎస్ ప్రాజెక్టులో ఎంపిక చేసిన చోట్ల ప్రయోగాత్మకంగా అమలు

కొయ్యూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పోషకాహారం అందించటంతో పాటు కూరగాయల సాగుతో వారి ఆరోగ్యానికి రక్షణగా అంగన్‌వాడీ కేంద్రాలు నిలుస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఎంపికచేసిన అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ వాటికలను ఏర్పాటుచేసి కూరగాయలు, ఆకుకూరలు సాగుకు ఆదేశాలిచ్చింది. ఇందుకు రూ.10 వేలు ప్రభుత్వం అందిస్తుండడంతో అంగన్‌వాడీ కేంద్రాలలో సిబ్బంది శ్రద్ధ వహించి పెరటి సాగు చేస్తున్నారు. ఇందులో భాగంగా కొయ్యూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 165 కేంద్రాలు (అంగన్‌వాడీ కేంద్రాలు 89, మినీ కేంద్రాలు 75) 0-6 సంవత్సరాల వయస్సుల పిల్లలు 4994 మం ది ఉండగా మొదటి విడతలో చుట్టుబంధ, పలకజీడి, గుడ్లపల్లి, గుజ్జుమానుపాకలు, చింతలపూడి అంగన్‌వాడీ కేంద్రాలను పోషణ వాటికల ఏర్పాటుకు ఎంపిక చేశారు. సొంత భవనం పక్కన విశాలమైన స్థలం ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ పోషణ వాటికలు ఏర్పాటుకు ఎంపిక చేశారు. ఈ వాటికలలో సేంద్రీయ ఎరువు వినియోగించి పోషక విలువలు ఉన్న ఆకుకూరలు, దుంప జాతి కూరగాయలతో పాటు వంగ బెండ, బీర, గోరుచిక్కుడు తదితర కూరగాయలను సాగుచేస్తున్నారు. వీటిని గర్భిణులు, బాలింతలకు అందచేయటం, చిన్నారులకు వండిపెట్టడం ద్వారా వారిని ఆరోగ్యంవంతులుగా చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. అయితే, గతంలో ఏ ప్రభుత్వ హయాంలో ఇలా అంగన్‌వాడి కేంద్రాలలో కూరగాయల సాగు చేసి బాలింతలకు, గర్భిణులకు అందించిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వ చొరవతో అధికారుల పర్యవేక్షణ, సూచనలతో పోషకా విలువలు కూడిన ఆహారం అందించటంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భారీ వాహనాలతో రహదారి ధ్వంసం

- రంపుడువలస రోడ్డులో నిరసన


మరమ్మతులు చేపట్టాలని బైఠాయించిన ఆదివాసీ గిరిజన సంఘ నేతలు, గిరిజనులు

అరకులోయ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొండాం పంచాయతీ పరిధి గన్నెల జంక్షన్ నుంచి కరకవలస రైల్వేస్టేషన్ వరకు గల రోడ్డు కొత్తవలస- కిరండోల్ రైల్వేలైన్ డంబ్లింగ్ పనులకు చెందిన వాహనాల వల్ల ధ్వంసమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, మండల కార్యదర్శి బుజ్జిబాబు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు శనివారం డంబ్లింగ్ పనులు చేపడుతున్న సంస్థకు చెందిన వాహనాలను నిలిపివేసి నిరసన తెలిపారు. కరకవలస, బొండాంకొత్తవలస, రంపుడువలస గ్రామ గిరిజనులతో కలిసి గన్నెల-కరకవలస రోడ్డు మధ్యన బైఠాయించారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ ఇప్పటికే పలుమార్లు నిర్మాణ సామగ్రి రవాణా భారీవాహనాల రాకపోకలతో దెబ్బతిన్న రహదారిని మరమ్మతులు చేపట్టాలని డంబ్లింగ్ పనులను పర్యవేక్షిస్తున్న రైల్వే ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లకు తెలియజేసినా స్పందించకపోవడంతో ఆందోళన చేయాల్సి వచ్చిందన్నారు.

అరకునుంచి కరకవలస డంబ్లింగ్ పనులు చేపడుతున్న ఆర్ ఎస్ఆర్, టీఎన్‌టీ, తుంబాత్ సంస్థలు, రైల్వే అధికారులు ఇకనైనాస్పందించి గన్నెల జంక్షన్‌నుంచి వయా రంపుడువలస, కరకవలస రైల్వేస్టేసన్ వరకు ఉన్న రహదారిని మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు రామారావు, టి.జోషి, రేగా పెసా అధ్యక్ష, కార్యదరులు డొంబు, కె.అప్పన్న బొండాం సత్యారావు, వార్డు మెంబర్లు రామస్వామి, డొబులు పరిసర గ్రామాల గిరిజనులు ఈనిరసనలో పాల్గొన్నారు.

అంతర్లలో క్రికెట్ పోటీలు


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ అనుషదేవి

చింతపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన యువత క్రీడల్లో రాణించాలని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. శనివారం అంతర్ల గ్రామంలో సోమలింగేశ్వర స్వామి జాతర పురస్కరించుకుని నిర్వాహకులు ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగామాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసం, శరీర దారుఢ్యం పెంచుతాయన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు విద్య, ఉద్యోగ అవకాశాల్లోరిజర్వేషన్ లభిస్తుందన్నారు. ఈక్రికెట్ పోటీలకు మండలంలోని పలు పంచాయతీల క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కుందేరి శంకర్, నరేశ్, కమిటీ సభ్యులు గబులంగి నాగేశ్వరరావు, కవడం శివ సంతోశ్ పాల్గొన్నారు.

స్కౌట్ శిక్షణతో సేవా భావం

- డీఈవో బ్రహ్మాజీరావు


బాడెన్ పావెల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఈవో

పాడేరురూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్కౌట్ శిక్షణతో విద్యార్థులలో క్రమశిక్షణ, సేవా భావం పెంపొందుతుందని డీఈవో పి.బ్రహ్మాజీరావు అన్నారు. స్కౌట్ ఉద్యమ పితామహుడు బాడెన్ పావెల్ జయంతి పురస్కరించుకుని తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన వరల్డ్ థింకింగ్ డే నిర్వహించారు.ఈ వేడుకల్లో పాల్గొన్న ఆయన స్కౌట్ అధికారులతో కలిసి బాడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాడెన్ పావెల్ చేసిన సేవలను వివరించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ప్రతీ విద్యార్థి స్కౌట్‌లో పాల్గొని సమాజానికి సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి బాక లవకుశ, పాఠశాల హెచ్ఎం. కంబిడి సుమిత్ర, వ్యాయామ ఉపాధ్యాయులు సింహాచలం, మన్మధరావు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు


కుజబంగి జంక్షన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : గిరి గ్రామాల్లో వ్యాధులు ప్రబల్లకుండా వైద్య ఆరోగ్య శాఖ ముందస్తు చర్యలు చేపట్టాలని విశాఖ ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆదేశించారు. మండలంలోని బంగారుమెట్ట పంచాయతీలో పలు గ్రామాల్లో శనివారం ఆమె పర్యటించారు. ఆరోగ్యపరంగా సమస్యలతో బాధపడుతున్న గిరిజనులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అలాగే, సరియాపల్లిలో ఇటీవల అతిసార బారిన పడిన గిరిజనుల యోగక్షేమాలను సర్పంచ్ రత్నని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధుల బారిన పడిన వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని గిరిజనులకు సూచించారు. నాటు వైద్యం(పసర మందు)జోలికి ఎవరూ వెళ్లరాదన్నారు. పరిశు భ్రత పాటించాలని కోరారు. ఏనుగురాయి పంచాయతీ రాత్తులపుట్టు గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం లేక ఆ ప్రాంతీయులు ఇబ్బందులు పడుతున్నారని ఆ సర్పంచ్ నరసింగరా వు జడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆమె రహదారిని పరిశీలించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పక్కా రహదారి నిర్మాణం చేపట్టేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు, నాయకులు జగబంధు, కొండలరావు, జేవీవీఎన్.మూర్తి, అప్పారావు, జగన్నాథం, సన్యాసిరావు, తిరుపతి పాల్గొన్నారు.

ఆర్‌వోఎఫ్ఆర్ భూముల్లో 150 రోజుల 'ఉపాధి'



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ లాలం సీతయ్య

చింతపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో ఆర్‌వోఎఫ్ఆర్ భూములు కలిగిన కూలీలకు 150రోజుల ఉపాధి పనులుకల్పించాలని పథకం ఏపీడీ లాలం సీతయ్య సూచించారు. శనివారం మండల పరిషత్ సమావేశమందిరంలో కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి మండలాల ఉపాధి హామీ ఉద్యోగులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ ఉపాధి కూలీలందరికీ వంద రోజుల పని కచ్చితంగా కల్పించాలన్నారు. ఆర్‌వోఎఫ్ఆర్ భూ ములు కలిగిన కూలీలకు అదనంగా మరో 50రోజులు పని కల్పించాల్సి ఉంటుదన్నారు. ప్రతి కూలీ రూ.300 వేతనం తీసుకోవాలన్నారు. మినీ గోకులం, కోళ్ల, మేకల షెడ్లు నిర్మాణాలను ప్రోత్సహించాలన్నారు. ప్రతి కుటుంబం ఇంకుడు గుంతలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో తడి, పొడి చెత్తతో వర్మికంపోస్టు తయారు చేసుకునే పిట్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మూడు మండలాల ఏపీవోలు పి. అప్పలరాజు, రాంప్రసాద్, రాజు, ప్లాంటేషన్ మేనేజర్ కెజియా పాల్గొన్నారు.

'వైసీపీకి భూ బదలాయింపు చట్టంపై మాట్లాడే అర్హతలేదు'


మాట్లాడుతున్న ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాజబాబు

చింతపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): భూ బదలాయింపు చట్టంపై వైసీపీ నేతలకు మాట్లాడే అర్హత లేదని ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. అధికారాన్ని ఉపయోగించి షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనేతరుల గృహనిర్మాణాల కోసం 1.5సెంట్ల మేర స్థలం కేటాయించాలని ఏడుగురు ఆదివాసీ ఎమ్మెల్యేలు సీఎంవోకి లేఖరాశారన్నారు. ఈ చట్టాన్ని తూట్లుపొడుస్తూ జగన్ ప్రభుత్వం చింతపల్లి మండలం గొందిపాకలు పంచాయతీ పరిధిలోని యర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టును షిర్డీసాయి ఎలక్ట్రికల్ కంపెనీకి అప్పగిస్తూ కేబినెట్ తీర్మాణం చేసినట్టు ఆయన గుర్తు చేశారు. గతంలో జగన్మోహన్‌రెడ్డి తండ్రి రాజశేఖర్‌రెడ్డి సైతం పాడేరులో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో గిరిజనేతరులకు సెంటున్నర స్థలం కేటాయిస్తామని ప్రకటించారన్నారు. జగన్ ప్రభుత్వం కూడా భూదలాయింపు చట్టాన్ని సవరించాలని చివరి నిమిషం వరకు ప్రయత్నం చేసిందన్నారు. ఈ విషయాలను ఆదివాసీలు మర్చిపోరాదన్నారు. ఇప్పుడు అధికారం పోయాక పెడబొబ్బలు పెడుతున్నారని ఎద్దేవా చేశారన్నారు. ఆదివాసీ చట్టాలను సవరించాలని ఎవరు ప్రయత్నించినా ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

కరాటే ఇన్‌స్ట్రక్టర్స్‌కు సమావేశాలు

పాడేరురూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కరాటే అసోసియేషన్ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ కొఫూకాన్ కరాటే క్లబ్ ఇండియా ద్వారా ఈ నెల 23, 24, 25వ తేదీలలో పాడేరు కేంద్రంగా కరాటే ఇన్‌స్ట్రక్టర్స్, సీనియర్స్, జూనియర్స్‌కు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్టు కరాటే క్లబ్ చీఫ్, ఇన్‌స్ట్రక్టర్, ఎగ్జామినర్ బాకూరు పాండురాజు తెలిపారు. కరాటే క్లబ్‌లో ఇప్పటి వరకు శిక్షణ పొందిన అభ్యర్థులు కరాటే క్లబ్ హర్షిత మెరిట్ సర్టిఫికెట్స్, బయోడేటా, ఆధార్ కార్డు, మూడు పాస్‌ఫొటోలతో రావాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్: 94909 97003ను సంప్రదించాలన్నారు.

430 పంచాయతీల్లో చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్: డీపీవో


ఇంటింట చెత్త సేకరణలో పాల్గొన్న డీపీవో లవరాజు, తదితరులు

పాడేరురూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటింట చెత్త సేకరణ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంశనివారం విజయవంతమైనట్టు డీపీవో బి.లవరాజు తెలిపారు. పాడేరులో ఆయన పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 430 గ్రామ పంచాయతీలలో 42,525 ఇళ్లలో ఇంటింట చెత్త సేకరణ స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. పాడేరు పంచాయతీ నీలకంఠానగర్ ప్రాంతంలో హుకుంపేట మండలం గడికించుమండంలో తాను పాల్గొన్నానన్నారు. శనివారం 935 కిలోల పొడి చెత్త, 753 కిలోల తడిచెత్త, 5,952 ప్లాస్టిక్ బాటిల్స్, 912 కిలోల ప్లాస్టిక్‌ను సేకరించినట్టు చెప్పారు. కార్యక్రమానికి సహకరించిన ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు. ఆదివారం ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు, పంచాయతీ సర్పంచి కొట్టగుళ్లి ఉషారాణి, ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడు,పంచాయతీ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు వి.చిన్ని తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పెదబయలు: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని పంచాయితీ విస్తరణ అధికారి నరసింగరావు అన్నారు. శనివారం పెదబయలులో స్వచ్ఛ సంకల్పంలో భాగంగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. సీతగుంట పంచాయతీకి చెందిన చెందిన పారిశుధ్య కార్మికుల ప్రధాన కూడలి, వీధుల్లో పరిసరాలను శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. తడి,పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించారు. ఆయన వెంట వార్డు సభ్యులు జీవన్‌కుమార్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం


తడి, పొడి చెత్తను సేకరిస్తున్న ఈవోఆర్‌డీ పాపారావు, పంచాయతీ కార్మికులు,

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తను పారిశుధ్య కార్మికులకు అప్పగించాలని స్థానిక ఈవోఆర్‌డీ పాపారావు ప్రజలకు సూచించారు. శనివారం ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా పెదవలసలో పంచాయతీ సిబ్బంది గృహాల వద్దకు వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించారు.ఈసందర్భంగా ఈవోఆర్ డీ మాట్లాడుతూ ప్రజ లు వ్యాధులకు దూరంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యదర్శి కె. బాలక్రిష్ణ పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు


సారాబట్టీని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సీఐ కూర్మారావు, పోలీసులు

చింతపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సారా తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.కూర్మారావు అన్నారు. శనివారం ఆయన నవోదయం-2లో భాగంగా రౌరింతాడ గ్రామ శివారులో సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల బెలం పులుసు ధ్వంసం చేసి, ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. సారా తయారీదారులు పట్టుబడలేదన్నారు. గ్రామాల్లో ఎక్కడైన సారా తయారీదారుల సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీ కుమార్, కానిస్టేబుళ్లు శివ, నాయుడు, రవితేజ పాల్గొన్నారు.

నేడు వనభంగిలో జాతర

పెదబయలు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి వనభంగిలో ఆదివారం దుర్గా పోతురాజు జాతరనిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పోరాపు సునీల్ కుమార్ తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి ఆలయం వద్ద గిరిజన సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు ఉంటా యన్నారు. భక్తులు పాల్గొని జాతరను విజయవంతం చేయాలని కోరారు.

'దౌర్జన్యంగా ఇళ్లు నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

హుకుంపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతకోట పంచాయతీ పాతకోట గ్రామంలో తన స్థలంలో దౌర్జనంగా గృహ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు గోయ్యి పోతన్న అధికారులను కోరారు. గ్రామంలోని సర్వే నంబరు 12లో తన స్థలం వద్ద అక్రమంగా అదే గ్రామానికి చెందిన సన్యాసిరావు, చిట్టిబాబు, గాసన్న, వంతల రాజబాబు ఇళ్లు నిర్మిస్తున్నారన్నారు. తన ఫిర్యాదు మేరకు ఆధారాలు తమకు అందించాలని తహసీల్దార్ ఆదేశించినా ఆ క్రమణదారులు పట్టించుకోలేదని ఆరోపించారు. తిరిగి భయాందోళనకు లోను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దౌర్జన్యం చేస్తున్న వారిపై కేసు నమోదు పోతన్న డిమాండ్ చేశారు.

విద్యార్థులకు రైటింగ్స్ మెటీరియల్స్ వితరణ


గురుకుల పాఠశాల విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేస్తున్న పోలీసులు

జి.మాడుగుల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గురుకుల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు సీఆర్‌పీఎఫ్ 198/ బీఎన్ ఓసీ కె.రాజా ఆధ్వర్యంలో శనివారం రైటింగ్ మెటీరియల్స్‌ఉచితంగా అందజేశారు. శ్రద్ధతో చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కేసీ దాస్, సిబ్బందిఉన్నారు.

కిశోర బాలికల సంక్షేమానికి సఖీ గ్రూపులు ఏర్పాటు

పాడేరురూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కిశోర బాలికల సంక్షేమానికి 3,103 గ్రూపులను ఏర్పాటు చేసినట్టు జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖాధికారిణి ఎన్.సూర్యలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 నుంచి 14 సంవత్సరాలు, 15 నుంచి 18 సంవత్సరాల వయస్సుగల స్కూల్, కళాశాలల్లో చదువుతున్న కిశోర బాలికల విద్య, ఆరోగ్యం, రక్షణ, ఉపాధి కల్పనపై ప్రతీ నెలా 1, 2, 3వ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వర కు సమావేశాలు నిర్వహిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 120 పాఠశాలల్లోని 3,103 గ్రూపుల్లో ఉన్న 29,957 మంది బాలికలకు మహిళా సంరక్షణ కార్యకర్త (ఎంఎస్‌కే) కన్వీనర్‌గా, అంగన్‌వాడీ కార్యకర్త, ఎంపీహెచ్‌డబ్ల్యూ, వీవోఏ కమిటీలతో ఈ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ డాక్టర్.ఎంజే. అభిషేక్ గౌడ లైన్ డిపార్టుమెంట్ అధికారులైన డీఈవో, డీపీవో, డీఎంహెచ్‌వో, డీఎల్‌పీవో, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ పాడేరు, రంపచోడవరంలలోని వారికి శనివారం ఆదేశాలు జారీ చేసినట్టు ఆమె పేర్కొన్నారు. బడిమానివేసిన బాలికలతో ఏర్పాటు చేసిన 534 సఖీ గ్రూపుల్లో ఉన్న 2,276 మంది బాలికలకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ అందించాలని కోరారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మకు మద్దతుగా విస్తృత ప్రచారం


రఘువర్మకు మద్దతు తెలుపుతున్న తలారిసింగి పాఠశాల ఉపాధ్యాయులు

పాడేరురూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, ఏపీటీఎఫ్, ఇతర అధ్యాపక, ఉపాధ్యాయ సంఘాలు బలపర్చిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మ విజయం కోసం టీడీపీ నియోజకవర్గ ఇ న్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో నాయకులు శనివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మండలంలోని తలారిసింగి, లోచలిపుట్టు, దిగువ మోదాపుట్టు, కందమామిడి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, పాడేరు ప్రభుత్వ డిగ్రీకళాశాలను సందర్శించారు. పలువురు ఉపాధ్యాయులు మద్దతు తెలిపారు. ఈ ప్రచారంలో టీడీపీ పాడేరు నియోజకవర్గ పరిశీలకులు రాజమండ్రి నారాయణ, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు తోట రత్నం, సబ్బిడి ఉమ, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొర్రా విజయరాణి, డప్పోడి వెంకటరమణ(బుజ్జి),మాజీ సర్పంచ్ కొండబాబు పాల్గొన్నారు.

జి.మాడుగుల: పాకలపాటి రఘువర్మ గెలుపునకు ఉపాధ్యాయ, అధ్యాపకులు కృషి చేయాలని ఏపీటూరిజం డైరెక్టర్ కిల్లు వెంకట రమేశ్‌నాయుడు, కొట్టగుళ్లి సుబ్బారావు కోరారు. పలు పాఠశాలల్లో ప్రచారం చేశారు. సోమెలి చిట్టిబాబు, నాయకులు మత్స్యరాస మత్స్యరాజు, ఎల్.బాలయ్యదొర ఎస్.శ్రీను, సర్పంచులు కృష్ణమూర్తి, సింహాచలం పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: పాకలపాటి రఘువర్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు కోరారు. జాముగుడ బాలికల ఆశ్రమ, అరకు ప్రభుత్వ పాఠశాలల్లో సందర్శించి ప్రచారం నిర్వహించారు. నాయకులు చిన గెన్ను, మాజీ సర్పంచ్ సుబ్బారావు, స్వామి, చంటి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించండి: మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

చింతపల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరిని గెలిపించాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ అన్నారు. శనివారం చింతపల్లి, జీకేవీధి మండలాల్లో పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేసిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమం లో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీ లక్ష్మి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. త్రిమూర్తులు పాల్గొన్నారు.

'డీఎస్సీపై ఉచిత కోచింగ్ అందించాలి'

పాడేరురూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షకు ఎదురు చూస్తున్న గిరిజన యువతకు ప్రభుత్వ పరంగా ఉచిత కోచింగ్ అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని టీడీపీ డివిజన్ నాయకుడు, దారెల పంచాయతీ సర్పంచ్ పాంగి పాండురంగస్వామి కోరారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది గిరిజన నిరుద్యోగులు డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిరీక్షిస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పోస్టులు భర్తీ చేయకుండా మోసగించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై వీరంతా ఆశతో ఉన్నారన్నారు. డీఎస్సీ ప్రకటన వెలువడిందన్నారు. అయితే, భర్తీలో జాప్యం జరగడంతో ఆర్థిక ఇ బ్బందులతో బాధపడుతున్నారన్నారు. ఈ స్థితిలో వీరికి ఉచిత కోచింగ్ అందించాలని కోరారు.

30వ రోజుకు చేరిన భూ దాతల దీక్ష


ఏకలవ్య పాఠశాల ఎదుట బాధితుల నిరసన

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురుకుల ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణానికి భూములు ఇచ్చిన గిరిజనులకు ఉపాధి కల్పనలో అధికారుల నిర్లక్ష్యం చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రామ్‌దాస్ అన్నారు. పాఠశాల ఎదుట బాధిత గిరిజనులు దీక్ష 30రోజులుగా దీక్షలు చేస్తున్నా సంబంధిత అధికారులు సమంజసం కాదన్నారు. వీరికి ఉద్యోగాలు ఇవ్వకుండా వేరే వ్యక్తులకు పాఠశాలలో ఉద్యోగాలు ఇవ్వడం అన్యాయమన్నారు. తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీమోదోనో, రాంచందర్, లైకోన్, క్రిష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

నాణ్యమైన బోధనతోనే చక్కని ఫలితాలు

» జిల్లా విద్యా శాఖాధికారి అప్పారావునాయుడు

చోడవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యా బోధనతో పాటు చక్కని ఫలితాలు వస్తాయని జిల్లా విద్యా శాఖాధికారి జి.అప్పారావు నాయుడు పేర్కొన్నారు. మండలంలోని కొత్తూరు బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రెండో విడత జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి డీఈవో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వినూత్నంగా విద్యా విషయాలను తెలియపరచాలన్నారు. అలాగే శిక్షణలో తెలుసుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో అమలు చేయడం ద్వారా చక్కని ఫలితాలు సాధించవచ్చన్నారు. తద్వారా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా శిక్షణ కేంద్రంలో తయారు చేసిన బోధనోపకరణాలను డీఈవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సింహాచలం, హెచ్‌ఎం ఐవీ.రామిరెడ్డి, రిసోర్సు పర్సన్లు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి షియాజ్‌ఖాన్

నర్సీపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కేసుల సత్వర పరిష్కారం కోసం వచ్చే నెల 8న జరిగే లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) షియాజ్‌ఖాన్ సూచించారు. స్థానిక కోర్టు సముదాయం ఆవరణలో శనివారం పోలీస్, అటవీ, ఎక్సైజ్, మునిసిపల్, రెవెన్యూ, బ్యాంక్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసులలో రాజీకి వచ్చే కక్షిదారులను గుర్తించి లోక్ అదాలత్‌లో పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిత్, జిల్లా అటవీ అధికారి శామ్యూల్, డీఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాహనదారులకు అర్హత పత్రాలు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

మాకవరపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు అర్హత పత్రాలు తప్పనిసరిగా తీసుకోవాలని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు సూచించారు. అవంతి కళాశాలలో రోడ్డు భద్రతపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. విలాసాల కోసం యువత మాదకద్రవ్యాలు విని యోగించడం ప్రమాదకరమన్నారు. అలా చేసేవారికి కఠినమైన శిక్షలు అమలు చేస్తున్నట్టు చెప్పారు. 18 ఏళ్లు నిండిన తరువాత విధిగా ధ్రువ పత్రాలు పొందిన తరువాతనే వాహనాలను నడపాలని సూచించారు. అనంతరం డీఎస్పీని కళాశాల యాజమాన్యం సత్కరించింది. ప్రిన్సిపాల్ మోహన్ రావు, సీఐ రేవతమ్మ, ఎస్ఐ దామోదర్‌నాయుడు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు, ఉత్సవ కమిటీ సభ్యులు

చోడవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వయంభూ గౌరీశ్వరాలయంలో మహా శివరాత్రి ఉత్సవాలకు సంబంధించి పోస్టర్‌ను ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు శనివారం ఆవిష్కరించారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు సురేశ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు, నాయకులు సేనాపతి శ్రీనివాసరావు, ఎలకా మల్లిబాబు, ఈర్లె శ్రీనివాస్, విస్సు, ఆలయ అర్చకులు కె.చలపతి పాల్గొన్నారు.

పాడి రైతులకు అండగా విశాఖ డెయిరీ



చాఫ్‌కట్టర్‌లు పంపిణీ చేస్తున్న డెయిరీ డైరెక్టర్ పవన్‌కుమార్

చోడవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని విశాఖ డెయిరీ డైరెక్టర్ దాడి పవన్‌కుమార్ తెలిపారు. స్థానిక డెయిరీ బల్క్‌మిల్క్ కేంద్రంలో శనివారం పాడి రైతులకు గడ్డి కటింగ్ యంత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా డెయిరీ పనిచేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ అధికారులు పాల్గొన్నారు.

గ్యాస్ స్టవ్ ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

కె.కోటపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ స్టవ్ ప్రమాదంలో మినీ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని గవరపాలెం శివారు భూమిరెడ్డి కొంపలు గ్రామానికి చెందిన మినీ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త కర్రి ఉమాపార్వతి శనివారం ఇంటి వద్ద గ్యాస్ స్టవ్ వెలిగించి వంట చేస్తుండగా గ్యాస్ లీకై పేలుడు సంభవించింది. మంటలు చెలరేగి ఉమాపార్వతి గాయపడగా, 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనానికి పాల్పడిన నలుగురు మైనర్లపై కేసు

» విశాఖపట్నం జువైనల్ జస్టిస్ బోర్డుకు తరలింపు

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏఎల్‌పురంలో దొంగతనానికి పాల్పడిన నలుగురు మైనర్లపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వై.తారకేశ్వర రావు తెలిపారు. ఏఎల్‌పురానికి చెందిన గుడివాడ అప్పలనాయుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెనుక గ్రిల్స్‌కి ఉన్న తాళాలు విరగ్గొట్టి దొంగలు చొరబడి చోరీ చేశారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేయగా అదే గ్రామానికి చెందిన నలుగురు మైనర్లను గుర్తించి, వారి నుంచి వస్తువులను స్వాధీనపర్చుకున్నారు. నలుగురిని అదుపులోకి తీసుకొని, విశాఖపట్నం జువైనల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరుస్తామని ఎస్ఐ తెలిపారు.

మూలకుచేరిన ఆర్వో ప్లాంట్లు.. తాగునీటికి ఇక్కట్లు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్వో ప్లాంట్లు మూన్నాళ్ల ముచ్చటగా మిగిలాయి. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే సదుద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ యూనిట్లు ఏడాది తిరగకుండానే మొరాయించాయి. వీటిని పట్టించుకునే నాథులే లేకపోవడంతో మూలకు చేరిపోయాయి.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేయని మూడు ఆర్వో యూనిట్లు
పది రోజులుగా బోరు నీరు తాగుతున్న విద్యార్థులు



కళాశాలలో పనిచేయని ఆర్వో ప్లాంట్లు



మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్‌కు తాళాలు వేసిన దృశ్యం

నర్సీపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జీజే కళాశాలలో 650 మంది విద్యార్థులు చదువుతున్నారు. 550 మంది క్రమం తప్పకుండా కళాశాలకు వస్తుంటారు. గత ప్రభుత్వంలో నాడు-నేడు పథకంలో సుమారు రూ.16.5 లక్షల వ్యయంతో ఏడాది క్రితం ఆహ్లాదా కంపెనీకి చెందిన మూడు ఆర్వో ప్లాంట్లు అమర్చారు. సదరు కంపెనీ ఐదేళ్ల సర్వీసు వారంటీ ఇచ్చింది. ఈ ప్లాంట్లు ఏడాదికే మరమ్మతులకు గురయ్యాయి. దీంతో పది రోజులుగా విద్యార్థులు బోరు నీటిని తాగుతున్నారు. కంపెనీ ఇచ్చిన వారంటీ కాగితాలకు పరిమితమైంది తప్పితే ఏ రోజు సర్వీసు గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. మధ్యలో చిన్న చిన్న మరమ్మతులకు గురైనప్పుడు ప్రిన్సిపాల్ ప్రైవేటు వ్యక్తులతో చేయించాల్సి వస్తున్నది. ఇప్పుడు పది రోజులుగా ఆర్వో యూనిట్లు పని చేయడం లేదని తెలియజేసినా ఆహ్లాదా కంపెనీ ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. దీనివల్ల విద్యార్థులు, సిబ్బంది బోరు నీటిని తాగాల్సి వస్తోంది. మధ్యాహ్న భోజన సమయంలో కూడా విద్యార్థులు తాగునీటికి తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని, ఆర్వో ప్లాంట్లు అమర్చిన ఆహ్లాదా కంపెనీపై చర్యలు తీసుకోవాలని, ప్లాంట్లు బాగుచేయించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

» నర్సీపట్నం ఆర్డీవో వీవీ.రమణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

గొలుగొండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని ఆర్డీవో వీవీ.రమణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన భూ సమస్యల పరిష్కార వేదికకు ఆయన హాజరై వినతులు స్వీకరించారు. పాతమల్లంపేట రెవెన్యూ గ్రామంలో చంద్రయ్యపాలెం గ్రామానికి చెందిన గిరిజనులు సర్వే నంబరులో 936/4లో ఏడు ఎకరాల భూమిని ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని, ఆ భూమిలో చిన్నయ్యపాలెం గ్రామానికి చెందిన వ్యక్తులు తమను ఇబ్బందులు పెడుతున్నారని వేదిక దృష్టికి తీసుకువచ్చారు. వారం రోజుల్లో ఇరు వర్గాల సమక్షంలో సర్వే నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని ఈ సందర్భంగా ఆర్డీవో హామీ ఇచ్చారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రతీ శనివారం పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో మేరీరోజీ తదితరులు పాల్గొన్నారు.

తిరునాళ్లకు పటిష్ఠ ఏర్పాట్లు: డీఎస్పీ శ్రావణి



ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అనకాపల్లి డిఎస్పీ శ్రావణి

రావికమతం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కల్యాణపులోవలో తిరునాళ్ల ఉత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అనకాపల్లి డీఎస్పీ శ్రావణి ఆదేశించారు. కల్యాణపులోవ పోతురాజుబాబు, పెద్దింటమ్మవార్ల ఉత్సవాల ఏర్పాట్లను శనివారం ఆమె పరిశీలించారు. ఈ జాతరకు ఎంతమంది భక్తులు వస్తారు, ఎక్కడెక్కడ నుంచి ఏ విధంగా చేరుకుంటారు, ట్రాఫిక్ సమస్య ఎక్కడ వస్తుందీ, పోలీస్ సిబ్బంది ఏ విధమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందీ తదితర అంశాలపై సీఐ కోటేశ్వరావును డీఎస్పీ అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉత్సవాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై ఆమె పలు సూచనలు చేశారు. మూడు రోజుల పాటు కార్లు, వ్యాన్లు, ఆటోలు తదితర వాహనాలను దొండపూడి రాణా వరకే అనుమతించాలని ఆమె స్పష్టం చేశారు. అలాగే భక్తులు అక్కడ నుంచి ఆర్టీసీ బస్సులో లోవకు వచ్చేలా చర్యలు చేపట్టి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎక్కడికక్కడ స్టాపర్‌లు ఏర్పాటు చేయాలన్నారు. జలాశయంలో స్నాన ఘట్టాల వద్ద ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేసి, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సీఐకి సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్, ఆర్టీసీ, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు బెంచీల వితరణ

నర్సీపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): క్రెడిట్ ఆక్సిస్ ఇండియా ఫౌండేషన్, క్రెడిట్ ఆక్సిజ్ గ్రామీణ్ లిమిటెట్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రూరల్ పోలీసు స్టేషన్‌కి స్టీల్ బెంచీలు, బారికేట్లు అందజేశారు. సీఐ రేవతమ్మకు శనివారం వీటిని అందజేశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో ఉపయోగపడటానికి ఐదు బారికేట్లు, ఫిర్యాదుదారుల కోసం రెండు స్టీల్ బెంచీలు వితరణ చేశారు.

చిన్నారుల అభ్యున్నతికే జ్ఞానజ్యోతి

రోలుగుంట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల సమగ్ర అభివృద్ధికి జ్ఞానజ్యోతి కార్యక్రమం ఉపయోగపడుతుందని ఎంఈవో జగ్గారావు పేర్కొన్నారు. రోలుగుంట జడ్పీ పాఠశాలలో శనివారం కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణలో భాగంగా తెలుగు, గణితం బోధనపై తర్ఫీదు ఇచ్చారు. హెచ్‌ఎం ప్రసాద్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ చలానాలు చెల్లించాలి

చోడవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తమ పెండింగ్ చలాన్లు వెంటనే చెల్లించాలని సీఐ బి.అప్పలరాజు సూచించారు. పట్టణంలో శనివారం వాహనాల పెండింగ్ చలానాల తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలపై ఉన్న చలానాలు చెక్ చేసి ఆన్‌లైన్‌లో కట్టించారు. కార్యక్రమంలో ఎస్ఐలు నాగకార్తీక్, జోగారావు పాల్గొన్నారు.


యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజాం గ్రామంలో టమోటా పంట యాజమాన్య పద్ధతులపై శనివారం శనివారం అవగాహన కల్పించారు. ఉద్యానవన శాఖాధికారి భానుపుష్పలత పంటను పరిశీలించి రైతులకు తగిన సూచనలు చేశారు. సాగులో ట్రల్లి విధానాన్ని అవలంబించడం వల్ల టమోటా కాపు మూడు నెలల నుంచి ఆరు నెలలు పెరుగుతుందన్నారు. ఆరు కోతల వల్ల రైతుకు అధిక ఆదాయం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో సంతోశ్, రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం లభిస్తుందని ఈవో లోవరాజు కోరారు. ఉపాధి పథకం కూలీలకు తడి, పొడి చెత్తలపై వడ్డాదిలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని చెప్పారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామకృష్ణరాజు, వీఆర్‌వో గోవింద్, వైద్య సిబ్బందిపాల్గొన్నారు.

భూములు అన్యాక్రాంతం చేస్తే చర్యలు



ఫిర్యాదుదారులతో చర్చిస్తున్న తహసీల్దార్, అధికారులు

రావికమతం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): డి.పట్టా భూములనుఅన్యాక్రాంతం చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ బి.వెంకటరమణ హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జరిగిన ప్రజా సమ స్యల పరిష్కార వేదికలో సమస్యలపై చర్చించారు. తమ డి.పట్టా భూమిని తట్టబందకు చెందిన అగ్రవర్ణాల వారు కౌలుకు తీసుకుని, ఇప్పుడు తమను రానివ్వడం లేదని పోర్లుపాలెం గ్రామానికి చెందిన వెంగలి అప్పారావు, కొండపల్లి పెంటయ్య, వెంగలి గొంతమ్మ ఫిర్యాదు చేశారు. భూమిని స్వాధీనం చేసుకోవాలని ఫిర్యాదుదారులకు తహసీల్దార్ సూచించారు. ఆక్రమణదారులు అడ్డగిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ స్వామి, సీనియర్ అసిస్టెంట్ వెంకటప్పారావు, ఆర్ఐ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ అయ్యన్నపాత్రుడును కలిసిన 'గొల్లంగి'



ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాన్ని స్పీకర్‌కు అందజేస్తున్న ఆనంద్‌బాబు

నర్సీపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలికుడు గొల్లంగి ఆనందబాబు స్పీకర్ అయ్యన్నపాత్రుడును మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం రాత్రి నర్సీపట్నం క్యాంప్ కార్యాలయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కరపత్రాన్ని స్పీకర్‌కు అందజేశారు. కూటమి పార్టీల మద్దతుతో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని, ఉపాధ్యాయులను కలవాలని మండల నాయకులను స్పీకర్ చెప్పినట్టు ఆనందబాబు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు తమ్మిన విజయ్‌కుమార్, డిప్యూటీ ఎలక్షన్ అబ్జర్వర్ సుమంత్‌నాయుడు, కొప్పుల వెలమ రాష్ట్ర డైరెక్టర్ సూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో డ్వాక్రా ఉత్పత్తుల విక్రయం

మెప్మా పీడీ సరోజిని



డ్వాక్రా ఆర్‌పీలతో మాట్లాడుతున్న మెప్మా పీడీ సరోజిని

నర్సీపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు బ్రాండ్ ఇమేజ్ కల్పించి ఆన్‌లైన్‌లో విక్రయించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ సరోజిని తెలిపారు. శనివారం ఆర్పీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డ్వాక్రా మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు సరైన మార్కెట్ సదుపాయం లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని, ఓఎన్‌డీసీ ప్లాట్‌ఫామ్‌లో వావ్ జీనీ యాప్ ద్వారా ఉత్పత్తులు విక్రయించుకునేలా ప్రణాళిక చేస్తుందన్నారు. ఐఎస్ నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా నిపుణులతో చర్చిస్తున్నారని, ఉత్పత్తులకు బ్రాండ్ ఇమేజ్ కల్పిస్తారని తెలిపారు. ఈ కామర్స్ సంస్థతో ఒప్పందం చేసుకోవడం ద్వారా ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ సదుపాయం లభిస్తుందని ఆమె తెలిపారు.

సూర్యఘర్ రిజిస్ట్రేషన్‌కు సహకరించాలి

రావికమతం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ యోజన పథకంలో అధిక శాతం మంది రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు మండల స్థాయి అధికారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ నందన్ కోరారు. శనివారం రెవెన్యూ, మండల పరిషత్ అధికారులతో సమావేశమై ఈ పథకం గ్రామ స్థాయిలో అందరికీ తెలిసేలా అవగాహన కల్పించాలని కోరారు. ఈ మేరకు గ్రామ స్థాయిలో రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని గృహ యజమానులకు ఈ పథకం ఆవశ్యతను వివరించి చైతన్యం తీసుకురావాలన్నారు. రానున్న కాలంలో థర్మల్, జల విద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉందనే ఉద్దేశంతో ఈ పథకంతో గృహ వినియోగదారులకు రాయితీపై అందించాలన్నదే కేంద్ర ప్రభుత్వం ఆలోచన అన్నారు. సోలార్ విద్యుత్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించి ఎక్కువ మంది రిజిస్ట్రేషన్లు చేయించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు.

మట్టి అక్రమ రవాణాకు రెవెన్యూ అడ్డుకట్ట



పెద్దేరు కాలువ సమీపంలో మట్టి తవ్వి ట్రాక్టర్లకు నింపుతున్న దృశ్యం

రావికమతం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరుపాక రెవెన్యూలో మట్టి అక్రమ రావాణాకు పోలీసులు అడ్డుకట్ట వేశారు. పెద్దేరు కాలువ సమీపంలో ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు చేసి పది ట్రాక్టర్లతో గుడివాడ, దాసరయ్యపాలెం తరలిస్తున్నారు. రెండు రోజులుగా మట్టి తవ్వి తరలించడంపై శనివారం స్థానిక ప్రజలు తహసీల్దార్‌కు సమాచారం అందించారు. దీంతో ఆర్ఐ సతీశ్, వీఆర్వో నాగరాజు వెళ్లి తవ్వాకాలను అడ్డుకున్నారు. తమకు చెందిన జిరాయితీలోని బంధువుల భూమిలోకి తరలించి ఎత్తు పల్లాలు సరిచేస్తున్నామని రైతు కొండబాబు వివరణ ఇచ్చారు. మట్టి తవ్వే భూమి జిరాయితీదా? ప్రభుత్వానిదా? సర్వే చేస్తామని ఆర్ఐ సతీశ్ స్పష్టం చేశారు.

చెత్త సేకరణ బుట్టల పంపిణీ

మాకవరపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ కోసం బుట్టలను పంపిణీ చేస్తున్నట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి చెప్పారు. మాకవరపాలెం, తామరం, పైడిపాల, రామన్నపాలెం గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది ద్వారా శనివారం చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపద కేంద్రాల ద్వారా ఎరువులను తయారుచేసి పంచాయితీలకు ఆదాయం తీసుకురావాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం ఆయా గ్రామాల్లో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. మాకవరపాలెం ఈవో బాలదొర, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరణ

గొలుగొండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్నారు. శనివారం గొలుగొండ, జోగంపేట, కొత్తమల్లంపేట, పాకలపాడు, గుండుపాల, ఏటిగైరంపేట, పుత్తడిగైరంపేట, చీడిగుమ్మల, పప్పుశెట్టిపాలెం గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేరించారు. అలాగే చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పాతమల్లంపేటలోని ఉమాధార మల్లేశ్వరస్వామి ఆల యం వద్ద స్వచ్ఛభారత్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, కార్యదర్శులు కుమార్, రాజేశ్ వెంకటరమణ పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి

మాకవరపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి రామ్మోహన్‌రావు తెలిపారు. మండల పరిషత్ కార్యలయంలో శనివారం జరిగిన జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యా విషయక అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి పిల్ల నమోదు శాతాన్ని పెంచాలన్నారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలతో ఆటపాటల ద్వారా పిల్లలకు బోధించి విద్య పట్ల ఆసక్తి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఎంఈవోలు మూర్తి, జాన్ ప్రసాద్, రిసోర్స్‌పర్సన్‌లు పాల్గొన్నారు.

పిల్లల్లో విద్యపై ఆసక్తి పెంచాలి

కె.కోటపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో విద్య పట్ల ఆసక్తి పెంచాలని జిల్లా అకడమిక్ మోనటరింగ్ అధికారి పట్నాయక్ సూచించారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన జ్ఞానజ్యోతి శిక్షణ శిబిరంలో ఆయన మాటాడారు. గుణాత్మక విద్యనందించేందుకు పాటుపడాలన్నారు. చిన్నారులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా అంగన్‌వాడీలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-1, 2 కె.సత్యనారాయణ, ప్రసాద్, సీడీపీవో మంగతాయారు, సూపర్‌వైజర్లు రాములమ్మ, సుశీల, రిసోర్స్‌పర్సన్ పాల్గొన్నారు.

పెయ్యిలకు టీకాలు వేయించాలి

చీడికాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నాలుగు నుంచి ఎనిమిది నెలల వయస్సు గల ఆడపెయ్యిలకు బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ ఏడీ వి.చిట్టినాయుడు సూచించారు. మండలంలో ఖండివరం గ్రామంలో టీకాల కార్యక్రమాన్ని శనివారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో టీకాల కార్య క్రమం జరుగుతుందన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పశు వైద్యులు ఎ.గణేశ్ కుమార్, సంతోశ్‌కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

భూముల ఫిర్యాదులపై ఆధారాలు తీసుకురండి

చీడికాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): భూముల ఫిర్యాదులపై తమ వద్ద ఉన్న ఆధారాలను తీసుకురావాలని మండల ప్రత్యేకాధికారి కేవీఎల్ఎన్.మూర్తి ఆదేశించారు. తన పేరుపై మంగళఇనాం పేరుగల భూమి ఉందని, పాస్‌బుక్ ఇవ్వాలని తునివలస గ్రామానికి చెందిన బి.నాగమణి స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై శనివారం ఎంపీడీవో విచారణ చేశారు. ఈ సందర్భంగా రైతు పి.అప్పలనాయుడు మాట్లాడుతూ తమకు పూర్వకాలం నుంచి జిరాయితీ భూమిగా ఉందని, అది ఇనాంగా రికార్డులో పడిందని వివరించారు. దీనిపై ఇరువర్గాల వారు తమ రికార్డులను వచ్చే వారం తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమ సుందర్రావు, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ రామారావు, ఏఎస్ఐ నాగేశ్వరరావు, వీఆర్‌వో మూర్తి పాల్గొన్నారు.

రఘువర్మకు మద్దతుగా ప్రచారం

చోడవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మద్దతుగా శనివారం ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులంతా మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి, టీడీపీ నేత ఎస్.సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు. అలాగే గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్ ప్రచారం నిర్వహించారు.

నాతవరంలో...

నాతవరం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కూటమి బలపరిచిన పాలకపాటి రఘవర్మకు మద్దతుగా నాతవరం, మన్యపురట్ల, చమ్మచింత, తాండవ పాఠశాలల్లో శనివారం ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్.వెంటకరమణ, తాండవ ప్రాజెక్టు చైర్మన్ కె.సత్యనారాయణ, నాయకులు పి.కొండబాబు, విజయ్‌కుమార్, అప్పిరెడ్డి మాణిక్యం, పాల్గొన్నారు.

గాదేకు మద్దతుగా...

చీడికాడ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాదే శ్రీనివాసులునాయుడుకు మద్దతుగా శనివారం ప్రచారం చేశారు. పీఆర్‌టీయూ, ఎస్టీయూ ప్రతినిధులు కరుణానాథ్‌మూర్తి, ప్రదీపకుమార్, డి.శ్రీనివాస్, డి.శ్రీనివాస్, పరదేశి పాల్గొన్నారు.

మార్చి 1 నుంచి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ-షాలిమార్ మధ్య ఒరిజినేటింగ్ ప్రత్యేక రైళ్లతోపాటు దువ్వాడ మీదుగా భువనేశ్వర్-యశ్వంత్‌పూర్, సంబల్‌పూర్-ఈరోడ్ మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

భువనేశ్వర్-యశ్వంత్‌పూర్-భువనేశ్వర్

02811 నంబరు గల రైలు మార్చి 1 నుంచి ఏప్రిల్ 26 వరకు ప్రతి శనివారం రాత్రి 7.15 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 1.53 గంటలకు దువ్వాడ, అదేరోజు అర్ధరాత్రి 12.15 గంటలకు యశ్వంత్‌పూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 02812 నంబరు గల రైలు మార్చి 3 నుంచి ఏప్రిల్ 28 వరకు ప్రతి సోమవారం ఉదయం 4.30 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.30 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది.

విశాఖ-షాలిమార్-విశాఖ

08508 నంబరు గల రైలు మార్చి 11 నుంచి ఏప్రిల్ 29 వరకు ప్రతి మంగళవారం ఉదయం 11.20 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు వేకువన 3 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08507 నంబరు గల రైలు మార్చి 12 నుంచి ఏప్రిల్ 30 వరకు ప్రతి బుధవారం ఉదయం 5 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 8.50 గంటలకు విశాఖ చేరుతుంది.

సంబల్‌పూర్-ఈరోడ్-సంబల్‌పూర్

08311 నంబరు గల రైలు మార్చి 12 నుంచి ఏప్రిల్ 30 వరకు ప్రతి బుధవారం ఉదయం 11.35 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి రాత్రి 9.30 గంటలకు దువ్వాడ, గురువారం రాత్రి 8.30 గంటలకు ఈరోడ్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08312 నంబరు గల రైలు మార్చి 14 నుంచి మే 2 వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటలకు ఈరోడ్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1.08 గంటలకు దువ్వాడ, రాత్రి 11.15 గంటలకు సంబల్‌పూర్ చేరుతుంది.

మన్యానికి బైక్‌లపై చలో చలో


బైకులపై లంబసింగి నుంచి పాడేరు వస్తున్న సందర్శకులు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

ఎత్తైన కొండలు.. కనుచూపు మేర పచ్చదనం.. మేఘాల్లో తేలిపోతున్నట్టుండే పొగ మంచు.. వెరసి సహజసిద్ధమైన సుందర ప్రదేశాల్లో స్నేహితులతో కలిసి బైక్‌పై ప్రయాణిస్తే...? ఆ మజానే వేరు. అందుకే మన్యంలోని పర్యాటక ప్రదేశాలను తిలకించేందుకు వచ్చే సందర్శకుల్లో అధికులు బైక్ ప్రయాణానికే మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో శని, ఆదివారాలు మన్యంలో ఎక్కడ చూసినా గులాబీ సినిమాలో 'మేఘాలలో తేలిపోమన్నది' పాటకు హీరో చక్రవర్తి బైక్ రైడింగ్ చేసినట్టుగా యువత బైక్‌లపై రయ్ రయ్ మంటూ ఉత్సాహంగా చక్కర్లు కొడుతున్నారు.

- పొగమంచులో బైక్ రైడింగ్‌పై యువత ఆసక్తి
- ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ప్రయాణం
- పర్యాటక సీజన్‌లో ఎక్కడ చూసినా వీరి సందడే

ఘాట్‌మార్గంలో ప్రయాణం వింత అనుభూతి

జాతీయ రహదారులు లేదా సాధారణమైన రోడ్లపై ప్రయాణం సహజంగానే ఉంటుంది. కానీ పాము మెలికల్లా రోడ్ల మలుపులపై తిరుగుతూ ఎత్తుపల్లాలతో ఉత్కంఠభరితమైన ఘాట్ ప్రయాణం వింత అనుభూతిని కలిగిస్తుంది. విశాఖపట్నం నుంచి మన్యంలోని వంజంగి హిల్స్, అరకులోయ, లంబసింగి ప్రాంతాలకు వచ్చే సందర్శకులకు ఘాట్ ప్రయాణం తప్పనిసరి. దీంతో కొందరు యువకులు బైక్‌లపైనే ఆయా ప్రాంతాలకు వస్తున్నారు. విశాఖపట్నం నుంచి పాడేరు, వంజంగి హిల్స్ వచ్చే యువ బైక్ రైడర్లు పాడేరుకు 30 కిలోమీటర్ల దూరంలో ఘాట్ మార్గం ప్రారంభమయ్యే గరికబంద నుంచి బైక్ ప్రయాణాన్ని ఎంజాయ్ చేస్తారు. అక్కడ నుంచి పాడేరు వచ్చే వరకు ఘాట్


మంచు ముసుగులో బైక్‌లపై వస్తున్న యువకులు

ప్రయాణం అనుభూతి, మార్గమధ్యంలో పెద్ద పెద్ద మలుపులు, కాఫీ తోటలు, చిన్న జలపాతాలను తిలకిస్తూ పాడేరు చేరుకుంటారు. అలాగే ఇక్కడి నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న వంజంగి హిల్స్‌కు చేసే బైక్ ప్రయాణం సైతం ఉత్కంఠగా, సాహసోపేతంగా ఉండడంతో యువకులు ఉత్సాహం చూపుతున్నారు. అరకులోయకు వెళ్లే యువత సైతం అనంతగిరి ఘాట్ మార్గంలోని ప్రయాణాన్ని, లంబసింగి, తాజంగి సందర్శించే వారు లంబసింగి, డౌనూరు ఘాట్ మార్గాల్లోని ప్రయాణంతో చక్కని అనుభూతి పొందుతున్నారు.

గతంలో ఉత్తరాది ప్రాంతాలకే పరిమితం

గతంలో ఉత్తర భారతదేశ పర్యటనలో భాగంగానే యువకులు, ఉత్సాహవంతులు బైక్‌లపై పర్యటించేవారు. అక్కడ మంచు, మేఘాల్లో విహరించేవారు. అయితే ఉత్తరాది ప్రయాణం అధిక వ్యయంతోపాటు ఎక్కువ రోజులు సమయం వెచ్చించాల్సిన పరిస్థితి. దీంతో మధ్యతరగతి, సామాన్య యువత ఉత్తరాది ప్రయాణం చేయలేని పరిస్థితి. ఈ తరుణంలో శీతాకాలంలో ఉత్తరాదిని తలపించేలా ఉండే మన్యంలోని సందర్శనీయ ప్రదేశాలకు బైక్‌లపై రావడం, ఇక్కడ సహజసిద్ధ అందాల నడుమ విహరించడం ఇటీవల పెరిగింది. దీంతో మన్యం పర్యటన అంటే బైక్‌లపై అయితేనే మజాగా ఉంటుందనే భావన యువతలో పెరిగింది. దీంతో పర్యాటక ప్రదేశాల్లో బైక్ రైడర్ల సందడి అధికంగా ఉంటున్నది.

మామిడిపాలెంలో ఆక్రమణల పర్వం

- 40 ఎకరాలు చేతులు మారాయని గిరిజనుల ఆరోపణ
- గత తహసీల్దార్ ప్రమేయంపై అనుమానాలు
- దర్జాగా భూములను చదును చేస్తున్న వైనం
- సర్వే చేస్తే గానీ గుర్తించలేమంటున్న రెవెన్యూ అధికారులు


ఆక్రమార్కులు చదును చేసిన భూమి

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో కొండలు కరిగిపోయాయి. డీపట్టా భూములు చేతులు మారిపోయాయి. గిరిజనుల భూములకు సైతం రక్షణ లేకుండాపోయింది. మాడుగుల మండలం శంకరం పంచాయతీలోని మామిడిపాలెం గ్రామ శివారున కొండకు ఆనుకుని ఉన్న ఆదివాసీల భూములు ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో చిక్కుకున్నాయి. సుమారు 40 ఎకరాలు ఆక్రమణకు గురైనట్టు గిరిజనులు ఆరోపిస్తున్నారు.

మామిడిపాలెం గ్రామ కొండశివారున కృష్ణంపాలెం గ్రామానికి చెందిన గిరి రైతులు తాత, తండ్రుల నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటూ వస్తున్నారు. కాలక్రమేణా వీరు పోడు వ్యవసాయంపై శ్రద్ధ తగ్గించారు. తుప్పలు పెరిగిపోవడంతో ఆ భూములపై గిరిజనేతరుల కన్ను పడింది. ఈ విధంగా సుమారు 40 ఎకరాలు ఆక్రమణకు గురైనట్టు గిరిజనులు ఆరోపిస్తున్నారు. గతంలో మాడుగులలో తహసీల్దారుగా పని చేసిన ఓ అధికారి హయాంలో ఇవి చేతులు మారినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆక్రమణకు గురైనట్టు ఆదివాసీలు చెబుతున్న ఈ భూములను ఓ వ్యక్తి ఆధ్వర్యంలో చదును చేయిస్తున్నారు. ప్రస్తుతం పనులు జరుగుతున్న ఆ భూములు 22.90 ఎకరాలు మాత్రమే ఉన్నదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఆ భూములను గతంలో గిరిజనేతరుల వద్ద ప్రస్తుతం భూమి చదును చేయిస్తున్న వ్యక్తి ఒప్పందం కుదుర్చుకుని చదును చేయిస్తున్నాడని తెలుస్తోంది. కొండకు ఆనుకుని ఉన్న భూముల్లో గిరిజనులతో పాటు గిరిజనేతరుల భూములు కలిసిపోయాయని, సర్వే నంబర్లలో కూడా క్లారిటీ లేక వాటిని గుర్తించడంలో రెవెన్యూ తల పట్టుకుంటున్నారు. పూర్తిస్థాయిలో సర్వే చేసి నివేదిక వచ్చేవరకు దీనిపై పూర్తి వివరాలు వెల్లడించలేమని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. దీనిపై తహసీల్దారు రమాదేవిని వివరణ కోరగా, ఆక్రమణకు గురైనట్టు గిరిజనులు ఆరోపిస్తున్న ఆ భూములు గిరిజనేతరులకు చెందినట్టుగా ఉన్నాయని, అక్కడి సర్వే నంబర్లలో తేడాలు ఉన్నాయని, సమగ్రంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సేంద్రీయ ఉత్పత్తుల సంత

- ప్రతి ఆదివారం వసంతబాల స్కూల్ ఆవరణలో నిర్వహణ
- మిషన్...ఫామ్ టూ ఫ్యామిలీ
- బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్
- రిటైర్డ్ రీజనల్ డైరెక్టర్ నేతృత్వంలో ఏర్పాటు
- మూడు వారాల క్రితం ప్రారంభం


వసంతబాల స్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్న సేంద్రీయ కూరగాయల సంత

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆహారం పొలం నుంచి ప్యాకింగ్ వరకూ కల్తీ జరుగుతోంది. వాటిని తిని చాలా మంది చిన్న వయస్సులోనే అనారోగ్యానికి గురవుతున్నారు. కల్తీ లేని కూరగాయలు, ఇంట్లో వండిన పదార్థాలనే తినాలని వైద్యులు సూచిస్తున్నారు. దాంతో చాలామంది రసాయనాలు వినియోగించకుండా పండించిన ఆర్గానిక్ (సేంద్రీయ) ఉత్పత్తులపై ఆసక్తి చూపుతున్నారు. ఇటువంటి వారి కోసం గురుద్వారా దగ్గరున్న వసంతబాల స్కూల్ ఆవరణలో ప్రతి ఆదివారం 'సేంద్రీయ సంత' నిర్వహిస్తున్నారు. మూడు వారాలుగా జరుగుతున్న ఈ సంతకు ఆదరణ బాగుంది. ఇక్కడ ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు, నూనెలు అన్నీ లభిస్తున్నాయి.

హాబీగా మొదలై...

సేంద్రీయ సంత నిర్వహిస్తున్న సంధ్య బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌లో రీజనల్ డైరెక్టర్‌గా పనిచేసేవారు. ఆరోగ్య సమస్యల వల్ల రాజీనామా చేశారు. మధురవాడలో ఉంటున్న ఆమె మేడపై కూరగాయలు పండించేవారు. ఇంట్లో వాడగా మిగిలినవి తెలిసిన వారికి పంచేవారు. ఇంకా మిగిలిపోయినవి మధురవాడ పరిసరాల్లో జరిగే సంతల్లో విక్రయించేవారు. అక్కడకు వచ్చే రైతులతో మాట్లాడితే..తాము కూడా సేంద్రీయ వ్యవసాయమే చేస్తున్నామని, మార్కెటింగ్ ఇబ్బందిగా ఉందని చెప్పడంతో సొంతంగా ఓ బజార్‌ను నిర్వహించాలనే ఆలోచన వచ్చింది. గురుద్వారా వద్ద ఉన్న వసంత బాల స్కూల్‌లో చదువుకున్న ఆమె తన తోటి సహాధ్యాయులతో ఈ విషయం చెప్పారు. ఆ స్కూల్ ఆవరణలోనే ప్రతి ఆదివారం సంత ఏర్పాటుచేసి ఉత్పత్తులు విక్రయిస్తే బాగుంటుందని అందరూ సలహా ఇచ్చారు. యాజమాన్యం అంగీకరించడంతో గత మూడు వారాల నుంచి సంత నిర్వహిస్తున్నారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గానుగ నూనెలు, వాటితో తయారుచేసిన ఆహార పదార్థాలు, హెర్బల్ ఉత్పత్తులు అన్నీ అమ్మడం ప్రారంభించారు. ఆదరణ బాగుండడంతో ఇతర రైతులు కూడా రావడానికి ఆసక్తి చూపుతున్నారు.

ఉపమాక వెంకన్న ఉత్సవాలను విజయవంతం చేయాలి

... 5వ పేజీ తరువాయి

చేపట్టాలని ఆలయ అధికారులను ఆదేశించారు. స్థానిక పంచాయతీ సహా ఇతర పంచాయతీల శానిటేషన్ సిబ్బందిని ఉత్సవాలకు నియమిస్తున్నట్టు చెప్పారు. ఉత్సవాలు ముగిసే వరకూ ఆలయ పరిధిలో ఎటువంటి వాహనాలను అనుమతించరాదని, తాను కూడా ఆలయ ముఖ ద్వారం నుంచి నడిచివస్తానని ఆమె స్పష్టం చేశారు. జిల్లాలో ప్రజా ప్రతినిధులందరికీ ఆహ్వానాలు పంపాలని సూచించారు. తాను సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేశ్, పవన్ కల్యాణ్‌లను ఆహ్వానించనున్నట్టు చెప్పారు. ప్రభుత్వం తరపున మార్చి 10వ తేదీన స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తానని చెప్పారు. ఉత్సవాల సమయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగరాదన్నారు. వీఐపీలకు నిర్దేశిత సమయంలోనే దర్శన సదుపాయం కల్పించాలని సూచించారు. ఉత్సవాలను ఈ ఏడాది ప్లాస్టిక్, పాలిథిన్ రహితంగా చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు, స్థానిక సర్పంచ్ ప్రగడ వీరబాబు, కూటమి నాయకులు కొప్పిశెట్టి కొండబాబు, గెడ్డం బుజ్జి, శివదత్, పెంకులరాజు, కురందాసు నూకరాజు, దేవర సత్యనారాయణ, వైబోయిన రమణ, అయినంపూడి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించాలి

- సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే కొణతాల వినతి

కొత్తూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. ఈ మేరకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఉత్తరాంధ్రలోనే ఈ జాతరకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఈ జాతరలో ప్రతి ఏడాది లక్షలాది మంది ప్రజలు పాల్గొంటారని తెలిపారు. కొత్త అమావాస్య సందర్భంగా అనకాపల్లిలో నూకాలమ్మ జాతర ప్రతి సంవత్సరం జరుగుతుందన్నారు.

భూ ఆధార్‌కు సర్వర్ కష్టాలు

... 5వ పేజీ తరువాయి

మండలంలో 17,587 మంది రైతులకు 5,356, గొలుగొండలో 7,925 మందికి 3,922 రైతులకు, రావికమతంలో 26,160 మందికి 7,268, వి.మాడుగుల మండలంలో 12,742 మందికి 6,040 మంది మాత్రమే నమోదు చేసుకున్నారు. ఇంకా ఐదు రోజులు మాత్రమే గడువు ఉంది. ఈలోగా రైతులందరూ రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వివరాలు నమోదు చేసుకోకపోతే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని వ్యవసాయ శాఖాధికారులు హెచ్చరిస్తున్నారు.

క్రైం... crime news

ప్రమాదవశాత్తూ జారి పడి ఒకరి మృతి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలోని డైట్ కళాశాల సమీపంలోని ఒక లేఅవుట్‌లో శుక్రవారం సాయంత్రం ఓ కార్మికుడు ప్రమాదవశాత్తూ జారిపడి తీవ్ర గాయాలతో ఎన్టీఆర్ వైద్యాలయంలో మృతి చెందినట్టు పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం మండలం గూడెం ప్రాంతానికి చెందిన పందిరి రమణ(35) ఈ నెల 19వ తేదీన పనికి వచ్చాడు. శుక్రవారం సాయంత్రం పని ముగిసిన తరువాత సమీపంలో టాయిలెట్‌కు వెళ్లగా అక్కడ నీరు నాచు పట్టి ఉండడంతో జారి పడిపోయాడు. అతని తలకు బలమైన గాయం కావడంతో తోటి కార్మికులు చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. వైద్యాలయానికి వచ్చేసరికే రమణ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి ఫిట్స్ వ్యాధి కూడా ఉందని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. మృతుని తల్లి రామాంజలి శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు తీవ్ర గాయాలు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలోని కొత్తూరు జంక్షన్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో విధి నిర్వహణలో ఉన్న హోంగార్డు మృతి చెందినట్టు ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం శనివారం తెలిపారు. ట్రాఫిక్ హోంగార్డు నడిపల్లి రామారావు కొత్తూరు జంక్షన్‌లో విధులు నిర్వహిస్తున్నాడన్నారు. అత్యవసరంగా టాయిలెట్‌కు వెళ్లడానికి ద్విచక్ర వాహనంపై సమీపంలోని ఖాళీ స్థలంలోకి వచ్చి తిరిగి బీట్ పాయింట్ అయిన కొత్తూరు జంక్షన్‌కు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొందన్నారు. ఈ సంఘటనలో రామారావు కాలికి బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేడు గ్రూప్-2 పరీక్ష

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటుచేసింది. పరీక్షలు రాసే అభ్యర్థులకు ఏమైనా ఇబ్బందులు వస్తే..0891-2590100, 0891-2590102కు ఫోన్ చేయాలని డీఆర్వో బీహెచ్ భవానీశంకర్ కోరారు. కంట్రోల్‌రూమ్‌లో ఇద్దరు ఉద్యోగులు అందుబాటులో ఉంటారన్నారు. ఏపీపీఎస్సీకి చెందిన అసిస్టెంట్ సెక్రటరీ పి.అశోక్ (ఫోన్ నంబరు 9014550879) కంట్రోల్ రూమ్‌లో ఉంటూ అందరినీ సమన్వయం చేస్తారని పేర్కొన్నారు.

జిల్లా యంత్రాంగం అప్రమత్తం

గ్రూప్-2 పరీక్ష వాయిదా వేయాలని పలువురు అభ్యర్థులు నగరంలో ఆందోళనలు నిర్వహిస్తుండడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. అభ్యర్థులు కలెక్టరేట్‌ను ముట్టడిస్తారన్న సమాచారంతో శనివారం ఉదయం నుంచి పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం పరీక్ష ముగిసేంత వరకు 16 కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేయాలని నగర పోలీస్ కమిషనర్‌ను జిల్లా యంత్రాంగం కోరింది. ఆదివారం ఉదయం పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులు ఆందోళనలు చేసే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతుంది.

రోడ్డెక్కిన అభ్యర్థులు

... 5వ పేజీ తరువాయి


అభ్యర్థులకు నచ్చచెబుతున్న పోలీసులు

వాయిదా వేయాలని, రోస్టర్ విధానాన్ని సరిచేయాలని డిమాండ్ చేశారు. అభ్యర్థుల ఆందోళనతో జాతీయ రహదారిపై ఇటు మద్దిలపాలెం, అటు హనుమంతువాక జంక్షన్ వరకూ ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో ట్రాఫిక్ పోలీసులు మద్దిలపాలెం నుంచి హనుమంతువాక వైపు వెళ్లాల్సిన వాహనాలను కృష్ణా కాలేజీ, వెంకోజీపాలెం మీదుగా మళ్లించారు. అలాగే అటు నుంచి రావాల్సిన వాహనాలను హనుమంతువాక జంక్షన్ వద్ద నుంచి విశాలాక్షి నగర్, ఎంవీపీ కాలనీ మీదుగా నగరంలోకి మళ్లించారు. మరోవైపు ఆందోళనకు దిగిన అభ్యర్థులతో పలువురు ఉన్నతాధికారులు వచ్చి సంప్రతింపులు జరిపారు. ఇలా రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేయడం సబబు కాదంటూ నచ్చజెప్పేందుకు యత్నించారు. అయినప్పటికీ అభ్యర్థులు తొలుత శాంతించలేదు. అయితే రాత్రి 10 గంటల తరువాత ఆందోళన విరమించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	65.00
లైవ్ ధర	85.00
విత్ స్కిన్	140.00
స్కిన్ లెస్	150.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454